www.prajaswaramdaily.com
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 282 | పేజీలు : 10 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | శనివారం 22-06-2024

MHR TV
www. mhrtv.com



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువా కప్పి సన్మానిస్తున్న పోచారం శ్రీనివాస రెడ్డి

## సీఎం రేవంత్ రెడ్డి
# రైతు బిడ్డ..

- ఆయన చేస్తున్న సంస్కరణలు నచ్చే కాంగ్రెస్‌లో చేరాం
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి
- కుమారుడు భాస్కర్ రెడ్డితో కలిసి పార్టీలో చేరిక
- భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తాం
- రైతుల సంక్షేమం కోసం అందరినీ కలుపుకుని పోతాం
- నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తి ప్రాజెక్టుల పూర్తికి ఆయన సహకారం తీసుకుంటాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 21, (ప్రజాస్వరం):** మాజీ స్పీకర్, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. ఆయనతోపాటు కుమారుడు భాస్కర్ రెడ్డి కూడా హస్తం తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ వచ్చి పదేండ్లు పూర్తైన తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడిందని, జరుగుతున్న పరిణామాలను చూసిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని, రేవంత్ రెడ్డిని తానే ఆహ్వానించినట్టు పోచారం పేర్కొన్నారు. రైతు బిడ్డగా ఆయన సంస్కరణలు నచ్చడం వల్లనే పార్టీలో చేరినట్టు తెలిపారు. మంచి పనులకు అండగా ఉండి, రైతు బాగుపడాలని ఆకాంక్షతో రేవంత్ నాయకత్వంలో పనిచేసేందుకు పార్టీలో చేరామని వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించామన్నారు. అండగా పెద్దలు నిలబడాలని కోరినట్టు వెల్లడించారు. తెలంగాణ రైతుల సంక్షేమం కోసం పోచారం కాంగ్రెస్ లో చేరారని తెలిపారు. రైతుల సంక్షేమంపై వారి సలహాలు సూచనలు తీసుకుని ముందుకెళతామని, రైతు రుణమాఫీ విధివిధానాలపై మంత్రివర్గ సమావేశంలో మిగతా 2 లో..

### పోచారం ఇంటి ఎదుట బీఆర్ఎస్ ఆందోళన 2



జమ్మూ కశ్మీర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని ఆసనం వేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

## యోగా అంటే
# విద్యా.. విజ్ఞానం

- ప్రపంచంలో ఇప్పుడిదొక ట్రెండ్
- దీని గురించి తెలుసుకునేందుకు ఇండియాకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది
- ప్రధాన మంత్రి నరేంద్రమోదీ
- జమ్మూ కశ్మీర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని యోగాసనాలు
- దేశ వ్యాప్తంగా ఘనంగా యోగా డే
- విద్యా సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో పండుగలా కార్యక్రమం
- పెద్ద ఎత్తున పాల్గొన్న యువత
- నేటి ఆధునిక సమాజంలో ఆవశ్యకతను వివరించిన యోగా గురువులు



## సింగరేణిని కాపాడుకుంటాం

- అవసరమైతే ప్రధానమంత్రిని కలుస్తాం
- సింగరేణి బంద్ అయితే వేలాది మంది రోడ్డున పడతారు
- గత పదేండ్లలో సింగరేణి ప్రాభవాన్ని కోల్పోయింది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

## ఏకకాలంలో రుణమాఫీ
### రూ. 2 లక్షల వరకు చేస్తాం



- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు కటాఫ్ తేదీగా నిర్ణయం
- రైతు భరోసా అమలుపై ఉపసంఘం వేశాం
- త్వరలో విధి విధానాలు ప్రకటిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- క్యాబినెట్ భేటీ అనంతరం వివరాలు వెల్లడి

***హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం)*** వ్యవసాయాన్ని పండుగ చేస్తామని, రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్మమని.. రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తామని తెలిపారు. శుక్రవారం సాయంత్రం క్యాబినెట్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2022 మే 6 వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ రుణమాఫీ హామీ ఇచ్చారని, ఆ మేరకు రూ. 2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు కటాఫ్ తేదీగా పరిగణలోకి తీసుకున్నట్టు తెలిపారు.రుణమాఫీతో 47 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనున్నది. రైతు భరోసా అమలుపై మంత్రి వర్గ ఉపసంఘం వేశాం. జులై 15లోపు ఉప సంఘం నివేదిక ఇస్తుంది. దాని ఆధారంగా విధి విధానాలు ఖరారు చేస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం రూ. 31 వేలకోట్లు అవసరమని అంచనా వేశామని తెలిపారు. రుణమాఫీపై ప్రభుత్వ నిర్ణయాలను ఇక నుంచి మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందిస్తారని వెల్లడించారు.



ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

## ఈడీ, ఐటీ దాడులతో వేధిస్తున్నారు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు
- నీట్ లీకేజీ బాధ్యులపై ఎందుకు దాడులు చేయలేదు
- రాష్ట్రంలో లక్ష మంది భవిష్యత్తు అయోమయంలో పడింది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు
- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి పరామర్శ

2

## ఎమ్మెల్సీ కవితకు లభించని ఊరట



- శుక్రవారం కోర్టు ఎదుట హాజరు
- జూలై 7 వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

2

## మొన్న బెయిల్.. నిన్న స్టే

2



- కేజ్రీవాల్‌కు షాకిచ్చిన ఢిల్లీ హైకోర్టు
- రౌజ్ అవెన్యూ కోర్టు బెయిల్‌పై స్టే

# సీఎం రేవంత్ రెడ్డి రైతుబిడ్డ

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకోబోతున్నామని, భవిష్యత్ లో పోచారం శ్రీనివాస్ రెడ్డికి సముచిత గౌరవం ఇస్తామని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటామని, ఇది రైతు రాజ్యం.. రైతు సంక్షేమ రాజ్యం.. రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకుని పోతామని రేవంత్ కామెంట్స్ చేశారు. శుక్రవారం ఉదయం పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తి అయిన వేళ ఇవాళ మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. సుమారు రెండు గంటల చర్చల అనంతరం పార్టీలో చేరుతున్నట్టు మాజీ స్పీకర్ పోచారం మీడియాకు తెలిపారు.కాంగ్రెస్ నుంచే రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పోచారం తర్వాత తెలుగుదేశంలోకి వచ్చారు. అక్కడ మంత్రిగా పని చేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో అప్పటి టీఆర్ఎస్ లో చేరారు. రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత ప్రభుత్వంలో మంత్రి, స్పీకర్ గా పని చేశారు. తెలుగు రాష్ట్రాల్లో స్పీకర్లు ఓడిపోతారనే అపవాదును పోచారం చెరిపేశారు. చాలా ఏళ్ల తర్వాత స్పీకర్ గా పని చేసిన తర్వాత కూడా ప్రజలను మెప్పించి 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో స్పీకర్లుగా పని చేసిన చాలా మంది ఓడిపోయారు. ఈయన మాత్రం చాలా కాలం తర్వాత గెలిచి రికార్డు బ్రేక్ చేశారు. రేవంత్ రెడ్డి చేపట్టిన రైతు సంస్కరణలు నచ్చి ఆపార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. తనకు వయసు అయిపోయిందని తన లాంటి వాళ్లకు ఉన్న రాజకీయ భవిష్యత్ చాలా తక్కువని చెప్పారు. రేవంత్ రెడ్డి లాంటి యువనాయకత్వాన్ని ప్రోత్సహిస్తే మరిన్ని మంచి పనులు చేస్తారని అభిప్రాయపడ్డారు. అందుకే రేవంత్ కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు స్పష్టం చేశారు.

పోచారం నివాసంలో ఈ చర్చలు కొన సాగుతున్న టైంలోనే ఆయన ఇంటి బయట ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. బాల్క సుమన్ నేతృత్వంలో బీఆర్ ఎస్ శ్రేణులు ఆయన ఇంటిని చుట్టుముట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరించి బీఆర్ ఎస్ నేతలను తీసుకుంటోందని ఆరోపించారు. ప్రజాసమస్యల నుంచి దారి మళ్లించేందుకు ప్రభుత్వం ఇలాంటి కుయుక్తులు పన్నుతోందని విమర్శిస్తూ నినాదాలు చేశారు. రేవంత్ రెడ్డి కాన్వాయ్ ను అడ్డుకునేందుకు బాల్కసుమన్ యత్నించారు. దీంతో పోలీసులకు బీఆర్ ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితి చేయిదాటిపోక ముందే నేతలను పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువా కప్పి సన్మానిస్తున్న పోచారం శ్రీనివాస రెడ్డి

# ఈడీ,ఐటీ దాడులతో వేధింపులు

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లొంగదీసుకోవాలని చూస్తున్నారు

## మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

## పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి పరామర్శ

**పటాన్ చెరు జూన్ 21(ప్రజాస్వరం):** పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుల ఇండ్లలో ఈడీ దాడులపై సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. శుక్రవారం అయన గూడెం మహిపాల్ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఈడీ, ఐటీ దాడులతో వేధిస్తున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో ఎలాంటి అవినీతి ఆస్తులు దొరకలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే లను భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీహార్, గుజరాత్ లలో నీట్ ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారు. ప్రశ్నాపత్రాలు లీకవుతున్నా అధికారులు ఎందుకు వారిపై దాడులు చేయటం లేదు. మన రాష్ట్రంలో లక్ష కుటుంబాలు నీట్ పరీక్ష రాశారు. వారి భవిష్యత్తు అయోమయంలో ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒత్తిడికి గురిచేస్తుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లు చుట్టూ తిరుగుతూ.. అధికార పార్టీ బెదిరింపు ధోరణికి పాల్పడుతున్నది. ఇంట్లో చిన్న పిల్లలు ఏడుస్తున్నా కర్కశంగా ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ దాడులు చేయటం దారుణం' అని హరీశ్ రావు అన్నారు.



గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న హరీశ్ రావు

# సింగరేణిపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా?

**కాంగ్రెస్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్**

**సింగరేణిని ప్రైవేటీకరించి దివాళా తీయించింది కేసీఆరే**

**తప్పుడు ప్రచారంతో ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర**



**హైదరాబాద్, జూన్ 21(ప్రజాస్వరం):** సింగరేణిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అంటూ కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీబీఐ విచారణ జరిపితే గత ప్రభుత్వ నిర్వాకాలతోపాటు సింగరేణి దుస్థితికి కారకులెవరో తేలిపోతుంద న్నారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన తరువాత కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మళ్లీ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరణ చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు కరీంనగర్ లోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ మున్సిపల్ గ్రౌండ్ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'మోదీ రామగుండం వచ్చి సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సింగరేణిలో కేంద్రానిది 49 శాతం వాటా మాత్రమే. రాష్ట్రానిది 51 శాతం ఉంది. అలాంటప్పుడు రాష్ట్ర అనుమతి లేకుండా సింగరేణి ప్రైవేటీకరించడం ఎట్లా సాధ్యం? సింగరేణి ఈ దుస్థితికి రావడానికి ప్రధాన కారణం నాటి సీఎం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. తాడిచర్లలో ఏపీ జెన్ కోకు ఇస్తే... కేసీఆర్ ప్రభుత్వం ప్రైవేట్ వాళ్లకు అప్పగించింది నిజం కాదా? సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరించిందే కేసీఆర్. ఆయన మూర్ఖత్వపు ఆలోచనవల్ల సింగరేణిని పూర్తిగా దెబ్బతీశారు. తన కుటుంబానికి ఏటీఎంగా మార్చుకున్నారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ది ఉంటే... సింగరేణి కార్మికుల పట్ల ప్రేమ ఉంటే గతంలో కేసీఆర్ చేసిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ము మీకుందా? నిన్న ఓ టీవీ చానల్ చర్చలో బీజేపీ ఎస్సీ మోర్చా నేత ఎస్.కుమార్ సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అని ప్రశ్నిస్తే... కాంగ్రెస్ నేత మాట్లాడుతూ తప్పనిసరిగా సింగరేణిపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాస్తామని చెప్పారు. ఆ మాటకు కట్టుబడి లేఖ రాసే దమ్ముందా? కేసీఆర్ కుటుంబం స్వలాభం కోసం సింగరేణిలో పొట్టుపొట్టు అవినీతి చేస్తే... కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోంది.

కేసీఆర్ సర్కార్ గతంలో నయీం కేసు, మియాపూర్ భూములు, డ్రగ్స్, పేపర్ లీకేజీ వంటి వాటిపై సిట్ వేసి మధ్యలోనే నీరుగార్చారు. కాంగ్రెస్ కూడా అంతే. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం విచారణ పేరుతో జాప్యం చేస్తూ లాభం పొందాలనుకుంటున్నారే తప్ప వేరే ఆలోచనలే లేదు. మళ్లీ చెబుతున్నా. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు. అసలు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా సింగరేణిని ప్రైవేటీకరించడం కేంద్రానికి సాధ్యమే కాదు.' అని తెలిపారు.

# పదో విడుత కోల్ మైన్ వేలం

## ప్రారంభించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

## హాజరైన డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 21, (ప్రజాస్వరం):** హైదరాబాద్ వెస్ట్ ఇన్ హోటల్లో పదో విడత కమర్షియల్ కోల్ మైన్ వేలం ప్రక్రియ నిర్వహించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ వేలంను ప్రారంభించారు. ఇందులో కేంద్ర బొగ్గుగనులశాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర బొగ్గు గనుల శాఖ అధికారులు, సింగరేణి సీఎండీ బలరాం, బిడ్డర్లు పాల్గొన్నారు. మొత్తం దేశవ్యాప్తంగా 60 బొగ్గు గనుల బ్లాక్ లను కేంద్రం వేలానికి ఉంచింది. ఈ వేలంలో తెలంగాణలోని శ్రావణపల్లి కోల్ మైన్ కూడా ఉంది. శ్రావణపల్లి కోల్ మైన్ లో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు గతంలో సింగరేణి గుర్తించింది. అయితే ఈ వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొంటుందా లేదా అనేది ఉత్కంఠ నెలకొంది. బొగ్గుగనుల వేలం ప్రక్రియను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. అన్ని పరిశ్రమలకు బొగ్గు ప్రాణాధారమన్నారు. తెలంగాణ ప్రభుత్వ వినతిని పరిశీలిస్తామని, ఈ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్తానని కిషన్ రెడ్డి హామీనిచ్చారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు సింగరేణి కార్మికులకు ఎలాంటి నష్టం జరగనివ్వమన్నారు. దాంతోపాటు నైని కోల్ బ్లాక్ విషయంలో ఒడిశాతో మాట్లాడి ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు కిషన్ రెడ్డి. బొగ్గు లేనిదే విద్యుత్ ఉత్పత్తి సాధ్యం కాదన్నారు. దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చడానికే ఈ బొగ్గుగనుల వేలం ప్రక్రియ జరుగుతుందన్నారు. మార్కెట్ లో బొగ్గుకు డిమాండ్ విపరీతంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ లో పరిశ్రమల కోసం ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ఆందోళన చేసేవారు. ఇప్పుడు వ్యవసాయం, కమర్షియల్, గృహ అవసరాలకు..తగినంతగా విద్యుత్ అందుబాటులో ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. శ్రావణపల్లి బ్లాక్ ను నేరుగా సింగరేణికి ఇవ్వాలని కోరారు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. కిషన్ రెడ్డి బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఎంపిక కావడం సంతోషకరమని.. తెలంగాణలోని పరిస్థితులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బాగా తెలుసన్నారు. గత ప్రభుత్వం తప్పిదాలతో సింగరేణి సంస్థ రెండు సార్లు వేలంలో పాల్గొనలేదని చెప్పారు. శ్రవణపల్లి బ్లాక్ ను సింగరేణికి కేటాయించాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ప్రభుత్వం తరఫున కిషన్ రెడ్డికి నివేదిక ఇచ్చారు భట్టి విక్రమార్క. తెలంగాణలోని 4 బొగ్గుగనుల బ్లాకులను వేలం వేయాలని కేంద్రం నిర్ణయించడం బాధాకరమని.. సింగరేణికి కొత్త గనులు కేటాయించాలని కోరారు.

# యోగా అంటే విద్యా.. విజ్ఞానం

## ప్రధాన మంత్రి నరేంద్రమోదీ

**న్యూఢిల్లీ, జూన్ 21 :** యోగా అనేది ప్రాచీన విద్యనే కాదు. విజ్ఞానం కూడా అని ప్రధాని మోదీ అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మూకశ్మీర్ లోని శ్రీనగర్ లో యోగా డేలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. యోగాకు జమ్మూకశ్మీర్ నిలయం. ప్రపంచంలో యోగా అనేది ఇప్పుడొక కొత్త ట్రెండ్. యోగా గురించి తెలుసుకునేందుకు ఇండియాకు వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది అని తెలిపారు.

# సింగరేణిని కాపాడుకుంటాం...

- అవసరమైతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలుస్తాం
- సింగరేణి బంద్ అయితే వేలాది మంది రోడ్డున పడతారు
- గత పదేండ్లలో సింగరేణి ప్రాభవాన్ని కోల్పోయింది
- డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 21, (ప్రజాస్వరం):** తెలంగాణ ప్రాంతానికే తలమానికమైన సింగరేణిని కాపాడుకోవడానికి అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలుస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సింగరేణి బంద్ అయితే వేలాది మంది తమ ఉద్యోగాలు పోగొట్టుకుని రోడ్డున పడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శ్రావణపల్లి బొగ్గు గనులను కేంద్రం వేలం వేస్తోందని ఈ విషయం గురించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలుస్తామని తెలిపారు. ఖమ్మంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు గనులపై బీఆర్ఎస్ నేతల తీరు దొంగే దొంగ అన్నట్లు ఉందన్నారు. గనుల వేలం సమయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల వ్యాఖ్యలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయంటూ మండిపడ్డారు.సింగరేణి సంస్థలో 42 వేల మంది రెగ్యులర్, 26 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థ ద్వారా 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి తన ప్రాభవాన్ని కోల్పోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని కలిసి తెలంగాణ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల వారిని కలుపుకుని ప్రధాని మోదీని కలుస్తామన్నారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసే ప్రక్రియ మొదలు పెడుతుందని చెప్పారు. ఏనాడూ సింగరేణి ఉద్యోగులను పట్టించుకోని బీఆర్ఎస్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తుందంటూ ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల మాటలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. 40 బొగ్గు గనుల్లో ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి 2026కి పూర్తిగా పడిపోతుంది. 2031-32 వరకు బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని సింగరేణి నిలబెట్టుకోవాలన్నా.. ఉద్యోగుల మనుగడ కొనసాగాలన్నా కేంద్రం నిర్వహించే గనుల ఆక్షన్ లో సింగరేణి యాజమాన్యం తప్పనిసరిగా కొత్త బొగ్గు గనులను సొంతం చేసుకోవాల్సిందేనన్నారు. లేని పక్షంలో సింగరేణి సంస్థ చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న కోల్ బ్లాక్స్ అన్నింటిని కూడా ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఇస్తే బాగుండేదన్నారు మంత్రి భట్టి విక్రమార్క. 2015లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మైన్స్ అండ్ మినరల్స్ డెవెలప్ మెంట్ రెగ్యులేషన్ యాక్ట్-1957 యాక్ట్ లో సవరణ తీసుకొచ్చింది. దీని ద్వారా దేశంలో ఉన్న బొగ్గు గనులను ప్రభు త్వ రంగ సంస్థకు నేరుగా ఇవ్వకుండా.. వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేసిందని మంత్రి ఆరోపించారు. మైన్స్ అండ్ మినరల్స్ డెవెలప్ మెండ్ రెగ్యులేషన్ యాక్ట్-1957 యాక్ట్ లో సవరణ బిల్లుకు పార్లమెంటులో ఆనాడు బీఆర్ఎస్ కూడా మద్దతు ఇచ్చిందంటూ గుర్తు చేశారు. కేంద్రం పెట్టిన బిల్లుకు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ పదేళ్లు సింగరేణిని కాపాడామంటున్నారు. తెలంగాణ మీద ప్రేమ ఉన్నట్లు బీజేపీ మంత్రులు మాట్లాడుతున్నారని విమర్శించారు.

# ఎమ్మెల్సీ కవితకు లభించని ఊరట

## జూలై 7 వరకు కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూన్ 21, (ప్రజాస్వరం) : సీబీఐ ప్రత్యేక కోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎదురుదెబ్బ తగిలింది. లిక్కర్ పాలసీ పై సీబీఐ దాఖలు చేసిన కేసులో కవితకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. గురువారానికి జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను శుక్రవారం వర్చువల్‌గా కోర్టు ఎదుట అధికారులు హాజరు పరిచారు. జులై 7 వరకు కస్టడీ పొడిగిస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మార్చి 15వ తేదీన హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆమె జ్యుడీషియల్ కస్టడీలోభాగంగా న్యూఢిల్లీలోని తీహార్ జైల్లో ఉన్నారు. బెయిల్ కోసం న్యాయస్థానాల్లో పోరాటం చేస్తున్నారు. ఆ తర్వాత ఇదే కేసులో ఆమెను సీబీఐ సైతం విచారించి అరెస్టు చూపించింది. మరోవైపు ఇదే కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేసింది కానీ.. ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది. కవిత బెయిల్ కోసం ఆమె తరపు న్యాయవాదులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కనీసం మధ్యంతర బెయిల్ కూడా దక్కలేదు. బీఆర్ఎస్ పార్టీ న్యాయ విభాగం కూడా శ్రమిస్తోంది. ఇటీవల కవిత కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. ఆమెకు బెయిల్ లభించలేదు. తనను అక్రమంగా అరెస్టు చేశారని.. ఇది మనీలాండరింగ్ కేసు కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసని అప్పట్లో కవిత చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఇప్పుడు ఆమె కస్టడీని కూడా కోర్టు పొడిగిస్తూ వస్తోంది. ఈ కేసులో కవితే ప్రధాన నిందితురాలని, ఆమెకు బెయిల్ వస్తే సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఈడీ వాదిస్తూ వస్తోంది. కాగా.. ఈమేరకు చార్జిషీట్ కూడా దాఖలు చేసింది. కాగా.. ఈ కేసులో 100 కోట్ల ముడుపులు చేతులు మారాయని.. అందులో కీలక సూత్రధారి, పాత్రధారి కవితేనంటూ ఈడీ, సీబీఐ అధికారులు స్పష్టం చేస్తున్నారు. చార్జిషీట్లలోనూ ఇదే విషయం చెప్పారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టు అయిన వారు సుదీర్ఘ కాలంగా జైల్లో ఉంటున్నారు. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనిష్ సిసోడియా అరెస్ట్ అయి ఏడాది దాటిపోయింది. కేజ్రీవాల్‌కు బెయిల్ లభించడం లేదు. ఆయన సీఎం పదవికి కూడా రాజీనామా చేయడం లేదు. అప్రూవర్లుగా మారిన ఇతర నిందితులు మాత్రం బెయిల్ తెచ్చుకున్నారు.

# మొన్న బెయిల్.. నిన్న స్టే

## కేజ్రీవాల్‌కు షాకిచ్చిన ఢిల్లీ హైకోర్టు

## రౌజ్ అవెన్యూ కోర్టు బెయిల్‌పై స్టే

**న్యూఢిల్లీ, జూన్ 21, (ప్రజాస్వరం):** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్ దొరికి కాస్తంత ఊరట వచ్చిన వెంటనే కేజ్రీవాల్‌కి మరో షాక్ తగిలింది. రౌజ్ అవెన్యూ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై హైకోర్టు స్టే విధించింది. కేజ్రీవాల్ బెయిల్‌ని వ్యతిరేకిస్తూ ఈడీ ఢిల్లీ హైకోర్టుని ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ని విచారించిన కోర్టు బెయిల్‌పై స్టే విధిస్తూ నిర్ణయం తీసుకుంది. లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కేజ్రీవాల్‌కి రౌజ్ అవెన్యూ కోర్టు జూన్ 20న బెయిల్ మంజూరు చేసింది. దీనిపై ఈడీ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వెంటనే ఈ బెయిల్‌ని సవాల్ చేస్తూ ఈడీ హైకోర్టుని ఆశ్రయించింది. జస్టిస్ సుధీర్ కుమార్ జైన్, జస్టిస్ రవీందర్ దుడేజాతో కూడిన ధర్మాసనం ఈ స్టే ఇచ్చింది. అయితే..అంతకు ముందు మరో బెంచ్ మాత్రం స్టే విధించాలన్న ఈడీ పిటిషన్‌ని తోసిపుచ్చింది.ఈడీ తరపున వాదించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ బెయిల్ ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. కేసుని పూర్తిస్థాయిలో విచారించడంలో తమకు ఆటంకాలు ఎదురవుతున్నాయని, అందుకు అనుకూల వాతావరణం కల్పించడం లేదని అన్నారు. దీనిపై తమ వాదన వినిపించేందుకూ సమయం ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. మనీలాండరింగ్ యాక్ట్‌లోని సెక్షన్ 45ని ప్రస్తావించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ బెయిల్‌పై స్టే విధించాలని కోరారు. దీనిపై ఇంకా విచారణ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. తిహార్ జైలు నుంచి కేజ్రీవాల్ విడుదల కావాల్సి ఉన్న హైకోర్టు స్టే ఇవ్వడం వల్ల ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ పిటిషన్‌పై మరో రెండు మూడు రోజుల పాటు విచారణ జరపాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఫలితంగా జూన్ 25వ తేదీ వరకూ కేజ్రీవాల్ జైల్‌లోనే ఉండనున్నారు. కేజ్రీవాల్‌కి వ్యతిరేకంగా సాక్ష్యాలు ఏమీ లేవని ట్రయల్ కోర్టు వ్యాఖ్యానించడాన్ని ఈడీ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ అసహనం వ్యక్తం చేశారు. అవాస్తవాల ఆధారంగా ట్రయల్ కోర్టు బెయిల్ ఇవ్వడం సరికాదని అన్నారు.

**ప్రధాని మోదీ న్యాయ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారు**

**ఆప్ నేత సంజయ్ సింగ్**

మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును ఢిల్లీ హైకోర్టు నిలిపివేసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ న్యాయ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని ఆప్ నేత సంజయ్ సింగ్ శుక్రవారం ఆరోపించారు. 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా సంజయ్ సింగ్ ఓ పోస్ట్ పెట్టారు. అందులో "మోదీ ప్రభుత్వం గుండాయిజం చూడండి, విచారణ కోర్టు ఉత్తర్వు ఇంకా రాలేదు, ఆర్డర్ కాపీ కూడా రాలేదు.. మోదీ తాలూకు ఈడీ మాత్రం హైకోర్టుకు చేరుకుంది. అయితే ఏ ఉత్తర్వును సవాలు చేయడానికి ఈడీ హైకోర్టుకు చేరుకున్నట్టు? " అని నిలదీశారు. "మోదీజీ మీరెందుకు న్యాయ వ్యవస్థను అభాసుపాలు చేస్తున్నారు? దేశమంతా మీ వ్యవహారం చూస్తోంది !" అని ఆప్ ఎంపీ పోస్ట్ లో పేర్కొన్నారు.

# రుణాల రికవరీకి డీసీసీబీ తిప్పలు

**నిజామాబాద్, జూన్ 21, (ప్రజాస్వరం) :** ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిజామాబాద్ సహకార బ్యాంక్ ఇప్పుడు అప్రతిష్టను మూటగట్టుకుంటున్నది. గత పాలకవర్గాలు తీసుకున్న ఇష్టారీతి నిర్ణయాలు, అడ్డగోలుగా ఇచ్చిన దీర్ఘకాలిక రుణాలతో ప్రస్తుతం డీసీసీబీ గింజుకుంటున్నది. రుణాల రికవరీ కోసం తంటాలుపడుతున్నది. తప్పకుండా ఈ నెలాఖరులోపు రుణాలను రికవరీ చేయాలని టార్గెట్లు ఫిక్స్ చేయడంతో సిబ్బంది దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కొందరు నిబంధనలను అతిక్రమించి వ్యవహరిస్తుండటం వివాదాస్పదం అవుతున్నది. అదీ ప్రాబల్యమున్న వారిని వదిలి రైతులనే టార్గెట్ చేసుకుని పని చేయడం విమర్శలకు తావిస్తున్నది. నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు.. రుణాల మంజూరీలో చాలా చోట్ల మార్గదర్శకాలను పాటించలేదని ఆరోపణలు ఉన్నాయి. కొందరికి నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇచ్చినట్టు ఆరోపిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారు సొసైటీ కనుసన్నల్లో ఇష్టారాజ్యంగా రుణాలు తీసుకు న్నట్టు కొందరు ఆరోపణలు చేస్తున్నారు.నెలాఖరులోపు బకాయిలు వసూలు చేయాలని అధికారులు టార్గెట్ ఫిక్స్ చేశారు. దీంతో సిబ్బంది కొంత దూకుడు, మరికొంత దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. లింగంపేటలో హద్దుమీరారు. ఓ రైతు పొలం వద్ద ఎర్ర జెండాలు పాతి.. భూములు స్వాధీనం చేసుకుంటామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి బెదిరించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ప్రభుత్వానికే చెడ్డపేరు తెచ్చేలా ఉన్నదని గ్రహించి అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. కాగా, సహకార బ్యాంకు తీరును రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. బకాయిల వసూళ్లలో పలుకుబడి ఉన్నవారి జోలికి పోవడం లేదని, రైతులను మాత్రం భూములు స్వాదీనం చేసుకుంటామని బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు కూడా ప్రకటించింది. మొండిబకాయిల వసూళ్ల కోసం బ్యాంకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. మొత్తం రూ. 250 కోట్ల బకాయిల్లో ఈ డ్రైవ్ ద్వారా రూ. 139 కోట్లు వసూలు చేయగలిగారు. మరో రూ. 111 కోట్లు వడ్డీతో కలిపి మొత్తం రూ. 130 కోట్ల వరకు బకాయిలు ఇంకా పెండిం గ్ లోనే ఉన్నాయి. నాబార్డు, టెస్కాబ్ వంటి సంస్థల నుంచి డీసీసీబీ రుణాలు తెచ్చి ఖాతాదారులకు లోన్లు ఇచ్చింది. తిరిగి ఆ సంస్థలకు చెల్లించాలంటే రుణగ్రహీతల నుంచి బకాయిలు చెల్లించాల్సిందే. ఈ రికవరీ కోసం బ్యాంకు వ్యూహాత్మకంగా ఆలోచన లు చేస్తున్నది. మొండి బకాయిల కోసం ప్రత్యేక రాయితీలు అవకాశాలు ఇస్తున్నది. జూన్ చివరి వరకు వన్ టైం సెటిల్ మెంట్ కు అవకాశం ఇచ్చింది. కానీ, ఈ అవకాశా న్ని కూడా కొందరు వినియోగించుకోవడం లేదు. ఇందులో రుణమాఫీ కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులు కూడా ఇందులో ఉన్నారు. రుణమాఫీ స్వల్పకాలిక రుణాలకు మాత్రమే వర్తించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదే నిజమైతే ముందుగా బ్యాంకు అధికారులు అలాంటి రైతుల్లో అవగాహన పెంచాల్సి ఉంటుంది.

# రుషికొండ నిర్మాణాలపై ట్వీట్ వార్

## టీడీపీ వైసీపీల మధ్య పరస్పర ఆరోపణలు

**విశాఖపట్టణం, జూన్ 21, (ప్రజాస్వరం):** వైసీపీ హయాంలో రుషికొండలో నిర్మించిన భవనాలపై వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఇప్పటికే అధికార టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ప్రభుత్వ సొమ్ముతో రుషికొండపై విలాసవంతమైన భవనాలు నిర్మించారంటూ టీడీపీ ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పిస్తోంది. వైసీపీ నేతలు సైతం దీనికి కౌంటర్ ఇస్తున్నారు. రుషికొండ భవనాల వివాదంపై మాజీ మంత్రి రోజా ట్వీట్ చేశారు. పర్యాటక స్థలంలో పర్యాటకశాఖ భవనాలు నిర్మించడం తప్పా అని ఆమె ప్రశ్నించారు. వర్షానికి లీకయ్యే అసెంబ్లీ, సచివాలయం కట్టినవాళ్లు నాణ్యతతో నిర్మించిన భవనాలు చూసి ఓర్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. 2021లోనే కేంద్ర అటవీపర్యావరణ శాఖకు సమగ్ర వివరాలు ఇచ్చి రుషికొండలో నిర్మాణాలు చేపట్టినట్లు ఆమె తెలిపారు." 61 ఎకరాలకు 9.88 ఎకరాల్లోనే నిర్మాణాలు చేపట్టాం. అందులో అక్రమం ఎక్కడుంది. ప్రతి దశలోనూ హైకోర్టుకు నివేదిక సమర్పించాం జగన్ సొంత భవనాలు అన్నట్టుగా ప్రచారం చేసేవాళ్లు..అవి ప్రభుత్వ భవనాలని ఇప్పటికైనా అంగీకరిస్తారా.. లేదా ?" అంటూ రోజా ట్వీట్ చేశారు.సుమారు 500 కోట్లతో రుషికొండపై జగన్ కోసం ప్యాలస్ కట్టి.. ఆ విషయాన్ని సీక్రెట్ గా ఉంచారంటూ టీడీపీ నేతలు ఎదురుదాడి చేస్తున్న నేపథ్యంలో.. నాటి పర్యాటక శాఖ మంత్రిగా ఆ విమర్శలకు రోజా కౌంటర్ ఇచ్చారు. ఇప్పటికే మాజీ మంత్రి అమర్ నాథ్.. అధికారపక్షం తీరును తప్పుపడితే.. ఇప్పుడు రోజా రియాక్ట్ అయ్యారు. పర్యాటక స్థలంలో పర్యాటకశాఖ భవనాలు నిర్మించడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ఇందులో ఎక్కడా అక్రమాలు లేవన్నారు రోజా.తాజాగా, మాజీ మంత్రి ఆర్కే రోజా ఈ అంశంపై స్పందించారు. రుషికొండలో పర్యాటక శాఖ భవనాలను నిర్మించడం తప్పా.? అని ఆమె ప్రశ్నించారు విశాఖ ఖ్యాతిని ఇనుమడించేలా, రాష్ట్రానికే తలమానికంగా భవనాలు నిర్మించడం కూడా నేరమేనా..? అని నిలదీశారు.బ్లాకుల్లో ఏమేమి నిర్మాణాలు, వసతులు ఉంటాయో గతంలోనే టెండర్ డాక్యుమెంట్లలో పొందుపర్చిన మాట వాస్తవం కాదా...? హైకోర్టుకు ఈ నిర్మాణాలపై ప్రతి దశలోనూ అధికారులు నివేదిక సమర్పించిన వాస్తవం దాచేస్తే దాగుతుందా..? ఇన్నాళ్లూ ఇవి జగనన్న సొంత భవనాలని ప్రచారం చేసిన వాళ్లు ఇప్పటికైనా అవి ప్రభుత్వ భవనాలని అంగీకరిస్తారా..? లేదా..? లేక్ వ్యూ గెస్ట్ హౌస్, పాత సచివాలయం ఎల్ బ్లాక్, హెచ్ బ్లాక్ లలో రూ.40 కోట్లతో హంగులు అద్ది రాత్రికి రాత్రి వాటిని వదిలేసి విజయవాడ వచ్చేసిన వాళ్లా ఈరోజు విమర్శలు చేసేది..?' అని రోజా ప్రశ్నల వర్షం కురిపించారు.

**టీడీపీ స్ట్రాంగ్ కౌంటర్**

అయితే, ఈ ట్వీట్ పై నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ రెడ్డి ట్విట్టర్ వేదికగానే స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు అన్నట్లుంది మీ యవ్వారం... ముందు ఆ ప్యాలెస్ కు.. మీ బెంజ్ కారుకు ఉన్న సంబంధం ఏంటో బయట పెట్టండి మాజీ మంత్రి గారు..' అంటూ ట్వీట్ లో పేర్కొన్నారు.

# సెంచరీ దాటేసిన టమోటా

**హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) :**

రాష్ట్రంలో కూరగాయలు ధరలు మండిపోతున్నాయి. డిమాండ్కు తగ్గట్టుగా ఉత్పత్తిగా లేకపోవటంతో కొద్దిరోజులుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. మొన్నటి వరకు రూ. 80లోపు ఉన్న టమాట, పచ్చి మిర్చీ ధర%ౌ% ఇప్పుడు ఏకంగా సెంచరీ మార్క్ ను దాటేసింది. మరికొద్దిరోజులు ధరలు తగ్గే అవకాశం లేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.హైదరాబాద్ కూరగాయల మార్కెట్లలోని ధరలు చూస్తే%ౌ% కిలో టమాట ధర 100కు చేరింది. ఇక పచ్చి మిర్చీ ధర ఏకంగా రూ. 120కు చేరింది. కేజీ బీరకాయ ధర రూ. 100గా ఉండగా%ౌ% గోరు చిక్కుడు ధర కూడా రూ. 100కు చేరింది. దీంతో మార్కెట్ లోకి వెళ్లిన విక్రయదారులు%ౌ% ఏ కూరగాయలు కొనాలన్న ఆలోచించే పరిస్థితి ఉంది. కిలో టమాట ధర రూ. 80గా ఉంది. పచ్చి మిర్చీ ధర కూడా రూ. 70 – 80 మధ్య పలికింది. గోరు చిక్కుడు ధర రూ. 50 నుంచి 60 మధ్య ఉంది. బెండకాయ కిలో ధర రూ. 60– 80 మధ్య ఉంది. కానీ రెండు రోజుల వ్యవధిలోనే వీటి ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో వినియోగదారులు మార్కెట్ కు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. చేతినిండా డబ్బులు తీసుకెళ్లిన సంచి సగానికి కూడా కూరగాయలు రావట్లేదంటూ సామాన్యులు వాపోతున్నారు.ఈ ఏడాది వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో%ౌ%. కూరగాయల ఉత్పత్తి భారీగా తగ్గిపోయింది. మే మాసంలో సగం రోజులు పూర్తి అయ్యాక రాష్ట్రంలో వర్షాలు మొదలయ్యాయి. దీంతో సీన్ క్రమంగా మారిపోయింది. వానలతో తడిసిపోవటంతో పాటు త్వరగా కుళ్లిపోవటం సమస్యగా మారింది. పక్క రాష్ట్రాల నుంచి భారీ మొత్తంలో కూరగాయలను దిగుమతి చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. వీటి రవాణ ఖర్చులు కూడా అధికంగా ఉంటున్నాయి. హైదరాబాద్ నగరంలోని ప్రధాన మార్కెట్లకు ప్రస్తుతం వస్తున్న కూరగాయల్లో 70 నుంచి 80 శాతం పక్క రాష్ట్రాల నుంచే వస్తున్నాయి. మన రాష్ట్రం నుంచి కేవలం 20 శాతం లోపే ఉంది. ఇక వానల రాకతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో త్వరగా కూరగాయలు కుళ్లిపోతుండటంతో వ్యాపారస్తులు దిగుమతులను క్రమంగా తగ్గిస్తూ వస్తున్నారు. రాష్ట్రంలో చూస్తే%ౌ% ఈ



సీజన్ లో కొంత కరువు ఛాయలు కనిపించాయి. నీటి వసతి లేక చాలా ప్రాంతాల్లో కూరగాయల సాగు తగ్గింది. వీటి ప్రభావంతో కూడా ప్రస్తుతం మార్కెట్ లో



కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. తెలంగాణలో పండిన పంట కేవలం 71క్వింటాళ్లు మాత్రమే. మిగిలిన పంట ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల నుంచి దిగుమతి అవుతుంది. ఇందులో 1000క్వింటాళ్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మదనపల్లి నుంచి వచ్చింది. తెలంగాణలోని వికారాబాద్, శామీర్పేట్, సిద్దిపేట, భువనగిరి, గద్వాల, గజ్వేల్, మేడ్చల్, జహీరాబాద్, తూప్రాన్, ప్రాంతాల నుంచి రావాల్సినంత టమాట పంట రావడం లేదు. తీవ్రమైన ఎండల వేడికి టమాట పంట తగ్గడమే ఇందుకు కారణమని వ్యాపారులు, అధికారులు చెబుతున్నారు.టమాట ధరల పెరుగుదల మిగతా కూరగాయలపై పడింది. దీంతో మార్కెట్లో కూరగాయ ధరలు మండిపోతున్నాయి. పచ్చిమిర్చి కిలో రూ.120 నుంచి రూ.140వరకు పలుకుతోంది. మొన్నటి వరకు రూ.100 లకు నాలుగు కిలోలు వచ్చే ఉల్లిగడ్డలు ప్రస్తుతం వందకు రెండి కిలోలే వస్తున్నాయి. అంటే కిలో ఉల్లి ధర రూ.50 పలుకుతోంది. కొత్తి మీర ధర కూడా భారీగానే పెరిగింది. కిలో కొత్తి మీర రూ.200 పైనే పలుకుతోంది. ఫ్రెంచ్బీన్స్ రూ. 175 నుంచి 210, టమాటా రూ. 100నుంచి 120, దొండకాయ రూ. 70నుంచి 80, బీరకాయ రూ.80నుంచి 100, బెండకాయ రూ.80నుంచి 100, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.80గా ఉన్నాయి. పంట ఉత్పత్తి గణనీయంగా పడిపోవడంతో అన్నిరకాల కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్ కు రూ.500 పట్టుకు వెళితే కనీసం సంచి అడుగుకు కూడా నిండడం లేదని సామాన్యులు వాపోతున్నారు. నిత్యం వంటల్లో వినియోగించే టమాటా, పచ్చిమిర్చి ధరలు హోల్సేల్లోనే కిలో రూ.100 దాటింది. కాగా రిటైల్ మార్కెట్లోత కిలో రూ.120 వరకు అమ్ముతున్నారు. ఆలుగడ్డ, చామగడ్డ లాంటివి కూడా కిలో రూ.60కి తగ్గడం లేదు. అన్నిరకాల కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులు మార్కెట్ కు వెళ్లాలంటే జంకుతున్నారు. మరికొద్దిరోజులు కూడా పరిస్థితులు ఇలాగే ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో వానకాలం సాగు నడుస్తోంది. ఇందుకు సంబంధించిన పంట జూలై, ఆగస్టు మాసంలో చేతికి వస్తుంది. వీటి ఉత్పత్తులు మార్కెట్లకు చేరితే%ౌ% మళ్లీ ధరలు తగ్గే అవకాశం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అప్పటివరకు సామాన్యుల జేబులకు చిల్లు పడే అవకాశం ఉందని అంటున్నారు.

# కారు రూటు మారింది..

**బాబు ఇమేజ్ పెంచేస్తున్న గులాబీ దళం**

**హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) :**

తెలుగుదేశం పార్టీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేసిందని కేటీఆర్ మీడియా ముందు చెప్పారు. నిజానికి ఈ విషయాన్ని టీడీపీ కూడా చెప్పుకోవడం లేదు. నిజామా తాము ఇంత విజయం సాధించామా అని ఏపీలోని టీడీపీ క్యాడర్ కూడా ఆశ్చర్యపోయింది. నిజానికి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేశామని కేంద్రం అధికారికంగా ఎక్కడా ప్రకటించలేదు. కానీ కొత్తగా బాధ్యతలు చేపట్టిన గనుల మంత్రి కిషన్ రెడ్డి మాత్రం.. ఇప్పట్లో ప్రైవేటీకరణ ఉండబోదని ప్రకటన చేశారు. దీన్నే ప్రైవేటీకరణ నిలిపివేత ప్రకటనగా కేటీఆర్ భావించారు. ఇప్పుడు కేంద్రంలో టీడీపీ కూడా కీలకమైన భాగస్వామి కాబట్టి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అంగీకరించదు. ఈ విషయం తెలుసు కాబట్టి కేంద్రం వ్యూహాత్మకంగా వెనక్కి తగ్గుతుంది. అందులో పెద్ద రాజకీయం లేదు. .అయినా కేటీఆర్ టీడీపీని పదే పదే పొగడటానికి దీన్నో కారణంగా తీసుకున్నారు. ఆయనే కాదు.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో కీలక నేత హరీష్ రావు కూడా టీడీపీ అధినేత చంద్రబాబును మ్కె అందుకున్నప్పుడల్లా పొగుడుతున్నారు. అయితే రేవంత్ ను కార్నర్ చేయడానికి ఆయన చంద్రబాబు ప్రస్తావన తెస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అంటే బీఆర్ఎస్ అగ్రనేతలకు అంత అభిమానం లేదు. మొదటి నుంచి టీడీపీకి వ్యతిరేకంగానే ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించి సమైక్యాంధ్రకు మద్దతు తెలిపినప్పటికీ రాష్ట్ర విభజన అనంతర రాజకీయాల కారణంగా వైసీపీ అధినేత జగన్తోనే సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ గురించి ఎప్పుడూ బీఆర్ఎస్ పెద్దలు పాజిటివ్ గా మాట్లాడలేదు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ ఓడిపోతుందని చెబుతారు. 2014 ఎన్నికల సమయంలో కూడా కేసీఆర్ ఏపీలో టీడీపీ ఓడిపోతుందని జోస్యం చెప్పారు. 2019 ఎన్నికల నాటకి ఏపీలో వైసీపీ గెలవడానికి జగన్మోహన్ రెడ్డికి తెలంగాణలో అధికార పార్టీగా అన్ని రకాలుగా అండాగ నిలిచారు. ఇటీవలి ఎన్నికల్లో చాలా మీడియా ఇంటర్వ్యూల్లో ఏపీలో టీడీపీ ఓడిపోతుందని.. జగన్ రెండో సారి అధికారంలోకి వస్తారని తమకు సమాచారం ఉందని చెబుతూ వచ్చారు. కానీ ఇప్పుడు పూర్తిగా వారి అభిప్రాయాలను మార్చుకున్నారు. టీడీపీ గురించి పాజిటివ్గా మాట్లాడుతున్నారు.తెలంగాణకు ప్రాంతీయ పార్టీలే శ్రీరామరక్ష అని చెప్పాలనేది కేటీఆర్ వ్యూహం. ఎంత శ్రీరామరక్ష అనేదితెలంగాణ ప్రజలకు చెప్పాలంటే.. వారికి ఎదురుగా టీడీపీనే కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీని అక్కడి ప్రజుల గెలిపించడం వల్ల ఆ రాష్ట్రం ఎన్నో ప్రయోజనాలు పొందుతుందని చెప్పాలని కేటీఆర్ అనుకుంటున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్నందున పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందబోతోందని ఇటీవల ట్వీట్ చేశారు. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ టీడీపీ ఆపేసిందని క్రెడిట్ ఇచ్చేశారు. అదే బీఆర్ఎస్కు ఓటు వేసి ఉంటే సింగరేణిని కాపాడుకునేవారమని.. జాతీయ పార్టీలకు ఓటు వేయడం వల్ల.. గనులు కూడా వేలం లో పాడుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఇది.. తెలంగాణకు అన్యాయం చేయడమేనని అంటున్నారు. అంటే.. కేటీఆర్ టీడీపీపై అభిమానంతో కాకుండా.. తన పార్టీని రివైవ్ చేసుకోవడానికి ..తన పార్టీ వైపు ఓటర్లు మళ్లడానికి.. టీడీపీని ఓ ఆయుధంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని సులువుగా అర్థం చేసుకోవచ్చు. మరో వైపు హరీష్ రావు కూడా చంద్రబాబును, టీడీపీ ప్రభుత్వాన్ని పొగుడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు చేస్తున్నారని అంటున్నారు. దీనికి కారణం రేవంత్ అమలు చేయలేకపోతున్నారని ఆయనకు చేత కావడం లేదని విమర్శలు చేయడానికే. రేవంత్ రెడ్డి పనితీరును తక్కువ చేయడానికి చంద్రబాబును హరీష్ రావు ఉపయోగించుకుంటున్నారు. నిజానికి ఎవరి పని తీరు వారిది. రేపు ఏపీలో టీడీపీ నేతలు రేవంత్ పనితీరును చూపించి చంద్రబాబును విమర్శించవచ్చు. బీఆర్ఎస్ నేతలు తెలుగుదేసం పార్టీ జపం చేయడం రాజకీయ వర్గాలకు ఆశ్చర్యకరమే. ఎందుకంటే గతంలో కూడా బీఆర్ఎస్ నేతలు టీడీపీ పేరును తరచూ ఉపయోగించేవారు.కానీ అది నెగెటివ్ కోణంలోనే. ఆ పార్టీ తెలంగాణకు ప్రమాదమని చెప్పేందుకు ఉపయోగించేవారు. తెలంగాణ వ్యతిరేక పార్టీ..ఆంధ్రా పార్టీగా ముద్ర వేసి.. మన దగ్గర ఉనికి ఉండకూడదని ఓటర్లకు చెప్పేవారు. కానీ ఇరప్పుడు రివర్స్ లో టీడీపీ ఏపీలో గొప్పగా చేస్తోందని.. ఇక్కడ కూడా .. ఏపీ ప్రజలు టీడీపీని ఆదరించినట్లుగా.. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ను ఆదరించాలని కోరుకుంటున్నారు. అదే చెబుతున్నారు. వీరి ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయో కానీ.. టీడీపీ మరో సారి తెలంగాణలో చర్చనీయాంశం అవుతోంది.

# ఎడారిగా శ్రీరామ్ సాగర్

**నిజామాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) :**

ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని సుమారు 12 లక్షల ఎకరాలకు తాగు, సాగునీరు అందించేందుకు నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8 టీఎంసీలు మాత్రమే నీరుంది. దీంతో ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్ కి పడిపోయింది. వర్షాకాలం ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా.. వరుణుడి కరుణ లేకపోవటంతో ఇప్పటివరకు కేవలం 1 టీఎంసీ నీరుమాత్రమే చేరింది. అటు ప్రాజెక్టు ఎగువన గల గోదావరి పరివాహ ప్రాంతంలో సైతం వర్షాలు లేకపోవడంతో గోదావరిలోకి ఇన్ఫ్లో లేకపోవటం, ఇటు ఖరీఫ్ సీజన్ మొదలు కావటంతో రైతన్నల్లో ఆందోళన మొదలైంది.ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్ర నిర్మించిన బాబ్లీ, విష్ణుపురి ప్రాజెక్టుల పరిస్థితీ ఇదే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాబ్లీ గేట్లు జూలై 1న ఎత్తాలి. కానీ, ఆ ప్రాజెక్టు ఖాళీ కుండలా ఉండటంతో గేట్లు ఎత్తినా ప్రయోజనం లేదు. ఇక.. ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతంలోని విష్ణుపురి ప్రాజెక్ట్ నుంచే ప్రస్తుతం కొద్దికొద్దిగా నీరు చేరుతోంది.మరోవైపు.. ఎస్సారెస్పీకి పూర్వ వైభవం తెచ్చేందుకు గత ప్రభుత్వం రూ. 1067 కోట్ల నిధులతో పునరుజ్జీవన పథకం పనులు ప్రారంభించి, గత జులైలో కాళేశ్వరం నుంచి 25 టీఎంసీల నీటిని తరలించారు. కానీ, ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిస్థితి గందరగోళంగా మారటంతో ఈ ఏడాది తమ ఖరీఫ్ పంట ఏమవతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. పదేళ్లలో 2016, 2018లో మాత్రమే సమయానికి వరదనీరు వచ్చి చేరింది. 2016లో జూలై నాటికే ప్రాజెక్ట్ నిండుకుండలా మారగా, వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలాల్సి వచ్చింది. 2018లోనూ ముందస్తు వరదలు వచ్చినా తర్వాత వానలు లేక.. ప్రాజెక్టు నిండలేదు. 2023లో సకాలంలో వరద నీరు భారీగా రావటంతో జూలైలో ప్రాజెక్ట్ నిండింది. మిగిలిన సంవత్సరాల్లో ఎప్పుడూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే వరదలు వచ్చి ప్రాజెక్టుకు వరదనీరు వచ్చింది. దీంతో ఆయా సంవత్సరాల్లో అధికారులు.. ఖరీఫ్కు నీటి విడుదల చేపట్టకుండా రబీ సీజన్ నాటికి కాస్త ముందుగా నీటిని విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితులు నేపథ్యంలో ఏ ఏడాదీ అదే పరిస్థితి వచ్చే అవకాశముందని నీటిపారుదల శాఖ భావించగా, వరుణుడు దయ తలిస్తే వారంలోనే ఈ పరిస్థితి మారి, తమకు ఖరీఫ్ పంట కూడా దక్కుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 112 టీఎంసీల పూర్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో నిర్మించిన నాటి నుంచి పూడిక పేరుకుంటూ వచ్చింది. దీంతో ప్రాజెక్టు సామర్థ్యం ప్రస్తుతం 90 టీఎంసీలని చెబుతున్నప్పటికీ, నిజానికి అంతకంటే తక్కువగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## కమలం గూటికి గంగుల..?



**కరీంనగర్. జూన్ 21 (ప్రజాస్వరం) :**

సోషల్ మీడియాలో చేసిన ఒక్క పోస్టుతో ఆ మాజీ మంత్రి పార్టీ మారబోతున్నారు అంటూ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. మారడం లేదని క్లారిటీ ఇచ్చినప్పటికీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన బండి సంజయ్ ని అభినందిస్తూ చేసిన పోస్టు ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఆ పోస్ట్ చూసిన కొంతమంది ఆయన బీజేపీలో చేరడం ఖాయం అంటూండగా మరి కొంతమంది మాత్రం సీఎం రేవంత్ రెడ్డితో ఉన్న సంబంధాలతో కాంగ్రెస్ లో చేరతానని అంటున్నారు. మరి ఆ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్తారా? లేదా? అనేది రాజకీయ వర్గాలలో హాట్ టాపిక్ గా మారింది.కరీంనగర్ ప్రస్తుత ఎమ్మెల్యే మాజీమంత్రి గంగుల కమలాకర్ పార్టీ మారతారని చర్చలు రాజకీయ వర్గాలలో జోరందుకుంటున్నాయి. కరీంనగర్ లో వరుస విజయాలు నమోదు చేసుకొని రికార్డ్ క్రియేట్ చేసుకున్నారు గంగుల కమలాకర్. కౌన్సిలర్ గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన గంగుల 2009లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 తర్వాత ఉద్యమ పార్టీగా ఉన్న టీఆర్ఎస్ లో చేరారు. వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీఆర్ఎస్ హయాంలో కీలక శాఖలకు మంత్రిగా చేశారు. దశాబ్ద కాలంగా కారు పార్టీలోనే జర్నీ చేస్తున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారు కావడంతో తిరిగి పార్టీ మారతారంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు తాను వీర విధేయుడ్ని అంటూ చెప్పుకుంటారు. అలాంటిది గంగుల కమలాకర్ పార్టీ మారతారని ప్రచారం జరుగుతుండడంతో క్యాడర్ లో గందరగోళం నెలకొంది. ఇక బిజెపి ఎంపీ బండి సంజయ్.. కంగుల కమలాకర్ ఇద్దరు ఉప్పునిప్పులా ఉంటారు. ఇద్దరి మధ్య చాలా అంశాలలో మాటల యుద్ధం తారస్థాయికి చేరుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. సంజయ్ కి కేంద్ర హోంశాఖలో సహాయ మంత్రిగా పదవి దక్కడంతో సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ మారతారనే ప్రచారాలు ఎవరికి తోచినట్టు వారు అనువదించుకుంటున్నారు. గంగుల మాత్రం నో కామెంట్స్ అన్నట్టుగా మౌనం పాటిస్తున్నారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి గంగులకు సన్నిహితంగా సంబంధాలు ఉన్నాయి తెలుగుదేశం పార్టీలో ఇద్దరు కలిసి పని చేశారు. తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో చెరో గూటికి చేరుకున్నారు. సీఎం అయిన తర్వాత గంగుల కమలాకర్ హస్తం గూటికి చేరుతారు అనే ప్రచారం కూడా జోరుగానే జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ గంగుల కమలాకర్ కు అడ్డు చెప్పినట్టుగా మరో టాక్ వినిపించింది. అయితే జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఇటీవల కరీంనగర్ పర్యటనలో గంగుల కమలాకర్ ఇంటికి వెళ్లిన కేసీఆర్, కేటీఆర్ పార్టీ మారకుండా నచ్చ చెప్పారని సమాచారం. కమలాకర్ కూడా పార్టీ మారనని స్పష్టత ఇవ్వడంతో కొన్ని రోజులపాటు జరుగుతున్న ప్రచారానికి తెర వేసినట్టు అయ్యింది.అయితే ఈ మధ్యకాలంలో బీజేపీకి అధిక పార్లమెంట్ సీట్లు రావడం.. గంగుల కమలాకర్ సోషల్ మీడియా వేదికగా బండి సంజయ్ కి శుభాకాంక్షలు తెలపడం రాజకీయ వర్గాలలో కొంతవరకు చర్చనీయాంశంగా మారింది.

## మాజీ మంత్రి గుడివాడ కొడాలి నానిపై వలంటీర్ల ఫిర్యాదు

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**గుడివాడ, జూన్ 21 (ప్రజాస్వరం) :**



మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని తమతో బలవంతంగా రాజీనామా చేయించారంటూ పోలీసులకు మాజీ వాలంటీర్లు ఫిర్యాదు చేసారు.. దాంతో గుడువాడ పోలీసులు వైసీపీ నేతపై కేసు నమోదు చేసారు. నానితో పాటు దుక్కిపాటి శశిభూషణ్, గొర్ల శ్రీను, మరో ఇద్దరు వైసీపీ నేతలపై కేసు నమోదు అయింది. ఎన్నికలకు ముందు పలువురు వార్డు వలంటీర్లతో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానికి గట్టి షాక్ తగిలింది. మాజీ వార్డు వలంటీర్లు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను వేధించి కొడాలి నాని తమతో బలవంతంగా రాజీనామా చేయించారంటూ వలంటీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కొడాలి నానిపై గుడివాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కొడాలి నానితో పాటు ఆయన సన్నిహితుడు దుక్కిపాటి శశిభూషణ్, గుడివాడ పట్టణ వైసీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను మరో ఇద్దరు వైసీపీ నేతలపై 447, 506 ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

## ఎమ్మార్వో మరో ఇద్దరు సిబ్బంది సస్పెండ్

**సికింద్రాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) :**

మారేడ్పల్లి ఎమ్మార్వో పద్మ సుందరితోపాటు మరో ఇద్దరు ఉద్యోగులను కలెక్టర్ అనుదీప్ సస్పెండ్ చేసారు. బుధవారం నాడు కలెక్టర్ ఆకస్మిక తనిఖీకి వచ్చారు. కార్యాలయంలో ఎవరు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసారు. రికార్డులు పరిశీలించి, ప్రభుత్వ భూములపై ఆరా తీసారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడం, సరిగ్గా రికార్డులు మైంటైన్ చేయకపోవడంతో ఎమ్మార్వో తో పాటు ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసారు.

## భద్రాద్రిలో శ్రీరామకల్యాణమా? లక్ష్మీనారాయణుల కల్యాణమా?



ఖమ్మం, జూన్ 21 (ప్రజాస్వరం) :

రాముడా? నారాయణుడా? దశాబ్ద కాలంగా రాములోరి క్షేత్రం భద్రాచలంలో ఇదే చర్చ జరుగుతోంది. తెగని వివాదంపై హైకోర్టును ఆశ్రయించారు రామ భక్తులు. కోర్టు వేసిన ఐదుగురి సభ్యుల కమిటీ రెండు రోజుల పాటు అర్చకులు, పండితుల అభిప్రాయాలు సేకరిస్తోంది. తర్వాత కోర్టుకు రిపోర్టు సమర్పించనుంది. ఇంతకీ భద్రాద్రిలో ఈ పంచాయితీ ఎందుకు?దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం క్షేత్రంలో దశాబ్దకాలంగా రామనారాయణపై వివాదం కొనసాగుతోంది. సీతారామచంద్రస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల తరుణంలో చర్చ తెరమీదకు వస్తుంది. భద్రాద్రిలో జరిగేది శ్రీరామకల్యాణమా లేక లక్ష్మీనారాయణుల కల్యాణమా అంటూ కొంతమంది ప్రశ్నిస్తుండటం చర్చకు దారి తీస్తోంది. దశాబ్ద కాలంలో ఎన్నోసార్లు ఈ విషయం శ్రీరామనవమి ముందు తెరపైకి రావటం, తర్వాత తెరమరుగు కావటం ఏటా జరుగుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వమే ఈ విషయంపై జోక్యం చేసుకోవాలని ఆధ్యాత్మికవేత్తలు, పీఠాధిపతులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదు. దీంతో కొంతమంది భక్తులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఐదుగురి సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సభ్యులు భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవాలయంలో రెండు రోజుల పాటు విచారణ చేపట్టారు. రామనారాయణ అంశం ఆలయ వైదికులకు, భక్తులకు ఎన్నో సవాళ్లు విసురుతోంది. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవంలో రామనారాయణ అనే మాటను వైదిక బృందం ఉపయోగిస్తోంది. కొన్ని వర్గాలు దీన్ని తప్పు పడుతున్నాయి. కొన్నేళ్లుగా ఈ వివాదాల తాకిడి రాజుకుంటూనే ఉండగా తమదే సరైన పద్ధతి అని ఇరుపక్షాలు చెప్పుకుంటున్నాయి. గతంలో పలు సంచలన విషయాలను ప్రస్తావిస్తూ గుంటూరు జిల్లా ఆరేపల్లి అగ్రహారానికి చెందిన డా. అన్నదానం చిదంబరశాస్త్రి రాసిన భద్రాద్రీశునకు జరుగుతున్న ఘోరాపచారం అనే పుస్తకం దుమారాన్నే రేపింది. రామాలయ సిబ్బంది ఈ పుస్తకంలోని అంశాలను ఖండించారుతెలంగాణ రాముడి వైభవం తగ్గించేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగానే రామనారాయణ వివాదాన్ని తెరమీదకు తీసుకొస్తున్నారనే వాదన ఉంది. గతంలో ఎన్నో చర్చా వేదికల్లో కూడా వివరించి ప్రభుత్వానికి కూడా నివేదిక సమర్పించామని మాజీ ప్రధానార్చకులు కోటి కృష్ణమాచార్యులు చెబుతున్నారు. ప్రతి ఆలయానికి కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు ఉంటాయని.. లేనిపోని అంశాల తెరమీదకు తేవొద్దంటున్నారు. ఆలయ సంప్రదాయ అంశంపై 1999 నుంచే కొంతమంది కుట్రలు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వచ్చారని పలువురు అర్చకులు అంటున్నారు. స్వామివారి కల్యాణం వైష్ణవ సంప్రదాయం ప్రకారం జరుగుతుందని నాటి కమీషనర్‌కు వివరించామని చెబుతున్నారు. 2000 సంవత్సరంలో కల్యాణం గురించి అసెంబ్లీలో కూడా చర్చకు వచ్చిందని, భద్రాచలం అర్చకులు పాటిస్తున్న సంప్రదాయాలే కొనసాగుతాయని హైకోర్టు కూడా గతంలో స్పష్టం చేసిందని గుర్తుచేస్తున్నారు. ఆ తీర్పుతో భంగపడ్డ కొందరు అప్పటినుంచి కుట్రలకు తెరలేపారని మండిపడుతున్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో.. రాముడా రామ నారాయణుడా అనేదానిపై దశాబ్ద కాలానికిపైగా కొనసాగుతోన్న వివాదం ఇప్పటికైనా కొలిక్కి వస్తుందా అన్న చర్చ ఉంది. హైకోర్టు కమిటీ వైదిక సిబ్బంది, వేద పండితుల అభిప్రాయ సేకరణతో పాటు వివాదానికి కారణాలను వీడియో రికార్డు ద్వారా సేకరిస్తుంది. తర్వాత కమిటీ సభ్యులు రాముడా.. రామనారాయణుడా అనే అంశంపై స్పష్టత కోసం వీడియోలు, అభిప్రాయాలను కోర్టుకు సమర్పించనున్నారు. దీనిపై ఫైనల్‌గా హైకోర్టు తీర్పు ఇచ్చే అవకాశం ఉంది.

## కలెక్టర్‌ను కలిసిన బైపాస్ బాధితులు

నల్గొండ, జూన్ 21 (ప్రజాస్వరం) :

నల్లగొండ జిల్లా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ని నల్లగొండ బైపాస్ బాధితులు కలిసారు. -బాధితులకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, సిపిఎం నేతలు మద్దతు పలికారు. మొదటి, రెండో ఆప్షన్ లను కాదని మూడో ఆప్షన్ ఎంచుకోవడంతో.. 2వేల మంది బాధితులు ఇండ్లు, ప్లాట్లు కోల్పోతున్నారు. మంత్రి కోమటిరెడ్డి తక్షణమే స్పందించి మూడో ఆప్షన్ ను రద్దు చేయాలని కోరారు. వచ్చే 15 రోజుల సమస్యను పరిష్కరించి బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి. చేసారు. న్యాయం జరగకుంటే.. బాధితుల పక్షాన ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని మాజీ ఎమ్మెల్యే కంచర్ల హెచ్చరించారు.

## రూపాదేవి పోస్టు మార్టెం పూర్తి

హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) :

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి మృతదేహానికి పోస్టు మార్టం పూర్తి అయింది. తరువాత పంచశీల కాలనీకి మృతదేహాన్ని తరలించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంట వున్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ రుపాదేవి మృతి దురదృష్టకరం ఒక గంటలోపల అంతిమ సంస్కార కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.. డైరీ ఫార్మ్ రోడ్డు సమీపంలోని స్మశాన వాటికలో అంత్యక్రియలు జరుపనున్నట్లు వెల్లడించారు..

## గళ్ళా మాధవి అను నేను

అమరావతి, జూన్ 21 (ప్రజాస్వరం) :

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలిగా గళ్ళా మాధవి ప్రమాణ స్వీకారం చేసారు. గుంటూరు పశ్చిమ నుండి గెలిచిన గళ్ళా మాధవి రాష్ట్రంలో మహిళా ఎమ్మెల్యేల్లో రెండో అత్యధిక మెజారిటీ సాధించారు. ప్రచార సమయంలోనే చంద్రబాబు నాయుడు ప్రశంసలు అందుకున్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో.. అక్రమాలు

మహబూబ్ నగర్, జూన్ 21 (ప్రజాస్వరం) :

మహబూబ్ నగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో పనిచేసిన ఓ అధికారి, తమ కార్యాలయ సిబ్బందితో కలిసి లక్షల్లో అవినీతికి పాల్పడ్డట్లు ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఏకంగా సీఎం కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టర్ వద్దకు అవినీతి భాగోతం తీసుకెళ్లడంతో రహస్య విచారణ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కోక్క ఇళ్లు అక్రమంగా కేటాయింపునకు సుమారు రూ. 3 లక్షల నుంచి రూ. 6లక్షలు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు%ొ% 'డబ్బుల్' బెడ్ రూం ఇళ్లలా మారాయి. ఇళ్ల పంపిణీ అంశంలో నిర్దిష్టమైన ప్రణాళిక అవలంబించకపోవడంతో అధికారుల అవినీతికి ఆసరాగా మారింది. నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి మరీ అమాయక ప్రజలను దోచుకున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా కేటాయించిన ఒక్కో ఇంటికి లక్షల్లో డబ్బులు వసూలు చేశారని ప్రభుత్వానికి ఫిర్యాదుల వెల్లువెత్తుతున్నాయి. మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో దివిటిపల్లి, వీరన్నపేట, మౌలాలిగుట్ట, ఏనుగొండ, క్రిస్టియన్ పల్లి ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు చేశారు. అయితే పంపిణీ విషయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు గత కొన్ని రోజులుగా బలంగా వినిపిస్తున్నాయి. పలువురు



దరఖాస్తుదారుల వద్ద డబ్బులు తీసుకొని అధికారులు ఇళ్లు కేటాయించారని ఇప్పటికే ఫిర్యాదులు సైతం అందాయి. ఇందులో నాటి మహబూబ్ నగర్ అర్బన్ తహసిల్దార్, ఆర్ఐ, కార్యాలయ సిబ్బంది మధ్యవర్తిని ఏర్పాటు చేసుకొని ప్రధాన పాత్ర పోషించారని బాధితులు చెబుతున్నారుఇక దివిటిపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూంలకు ధర ఎక్కువగా నిర్ణయించారు. ఇక్కడ ఇళ్లు అక్రమంగా కేటాయించాలంటే సుమారు రూ. 5లక్షల వరకు వసూలు చేశారని బాధితులు చెబుతున్నారు. వీరన్నపేటలో రూ. 4లక్షలు, మౌలాలిగుట్టలో రూ. 3లక్షలు.. ఇలా ఒక్కో ప్రాంతానికి ఒక్కో ధర ఫిక్స్ చేసి కోరిన చోట్ల ఇళ్ల కేటాయింపులు చేశారని వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలోనే తమకు కూడా అదే పద్ధతిలో కేటాయిస్తామని నమ్మబలికి లక్షల రూపాయలు వసూలు చేశారని చెబుతున్నారు. హాట్ బాక్స్, కవర్లలో నగదును%ొ% పార్టీల పేరుతో మందు, కాల్చిన మటన్, బిర్యానీలను తీసుకునే వారని బాధితులు ఆరోపిస్తున్నారు. పట్టా గురించి అడిగితే మాత్రం సమాధానం దాటవేసేవారని వెల్లడించారు. చివరకు ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందని తప్పించుకున్నారని%ొ% ఇప్పుడు అడిగితే బదిలీపై వెళ్లిపోయామని సమాధానం ఇస్తున్నారని మొర పెట్టుకుంటున్నారు. బాధితుల ఆరోపణలకు ఊతం ఇచ్చేలా జిల్లా కేంద్రంలో ఓ మహిళకు ఇళ్ల కేటాయింపు అంశం తెరమీదకు వచ్చింది. సదరు మహిళకు మొదటగా మౌలాలిగుట్టలో %ూ%-14-299 ఇంటిని కేటాయించడంతో అది నచ్చలేదని తిరస్కరించారు. దివిటిపల్లిలో మరో నెంబర్ %ఎ% 22-573 తో ఇళ్లు కేటాయించారు. అయితే అది కూడా నచ్చకపోవడంతో ప్రస్తుతం %జీ% 21-553 కేటాయించారు. ఓ పక్క ఇళ్లు రాక బాధితులు అధికారుల కాళ్ల వేళ్ల పడుతుంటే ఆ మహిళకు మాత్రం కోరిన చోట, నచ్చిన ఇళ్లు కేటాయించడం వెనుక అవినీతే ప్రధాన కారణమని తెలుస్తోంది. సదరు అధికారుల చేతివాటంతోనే ఈ తతంగం అంతా నడిచిందని బాధితులు చెబుతున్నారు. ఆ తహసిల్దార్ ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినప్పటికీ ఇప్పటికూడా ఖాళీ ఇళ్లకు పాత తేదిలతో సంతకాలు చేసి కేటాస్తున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన వంటల వెంకటేశ్, సత్యనారయణ, సరితా అనే మహిళతో పాటుగా పలువురు అధికారులకు డబ్బులు సమర్పించుకుని లబోదిబోమంటున్నారు. పైసా పైసా పోగు చేసి గూడుకోసం ఇస్తే మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ తో పాటుగా ప్రగతిభవన్ వద్ద జరిగే ప్రజావాణిలో ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. బాధితుల వరుస ఫిర్యాదులతో డబుల్ ఇళ్ల స్కాంపై రహస్య విచారణ సాగిస్తున్నట్లు తెలుస్తోంది. మోసపోయిన తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## కరీంనగరం.... చేతికి చిక్కుతుందా...

కరీంనగర్, జూన్ 21 (ప్రజాస్వరం) :

కరీంనగర్ రాజకీయం రంజుగా మారింది. మంత్రి పొన్నం ప్రభాకర్ వర్సెస్ మేయర్ వై.సునీల్ రావు అన్నట్లు రాజకీయం నడుస్తోంది. మేయర్ పదవి నుంచి సునీల్ రావు ను దింపడమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతుంది. కాంగ్రెస్ దూకుడుకు కళ్లెం వేసేలా గులాబీ సైన్యం సిద్ధమై వాగ్ధాటి చేస్తుంది. నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్ నగర్ పాలక సంస్థపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఏకపక్షంగా మంత్రి పొన్నం మున్సిపల్ పై నిర్వహించిన సమీక్షా సమావేశం రాజకీయ విమర్శలకు వేదికయింది. కార్పొరేషన్ అంటే ఐదులక్షల జనాభా, 60 డివిజన్లు, రూ. 650 కోట్ల బడ్జెట్. స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్ రావు లకు కనీస సమాచారం ఇవ్వకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. స్మార్ట్ సిటీ పనులతోపాటు శానిటేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పన్నుల వసూలు, తాగునీటి సరఫరా, పలు అంశాలపై సమీక్షించిన మంత్రి పొన్నం అనవసర ఖర్చులు, అవకతవకలపై అధికారులను సుతిమెత్తగా మందలించారు. గత ప్రభుత్వం ప్రస్తుత పాలక వర్గం చేపట్టిన పనులపై విచారణకు ఆదేశించి మున్సిపల్ అధికారులతోపాటు పాలక పక్షానికి భయాందోళనకు గురి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందని ఏ పని చేపట్టినా జవాబుదారిగా ఉండాలని ఆదేశించి పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరోక్షంగా పాలక పక్షానికి చురకలు అంటించారు. ప్రతిపాదన లేకుండా వ్యయాన్ని పెంచేసి చేపట్టిన పనులపై అసహనం వ్యక్తం చేస్తు తప్పు జరిగినట్లు నిరూపణ అయితే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రగతి పనుల పై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షించడం... ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం బాగానే ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులకు పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా సమీక్ష సమావేశం నిర్వహించడమే ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. మంత్రి పొన్నం పై మేయర్ సునీల్ రావు ఫైర్ అయ్యారు. పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లా ఓటర్ కాదని, కరీంనగర్ తో సంబంధం లేని వ్యక్తి మున్సిపల్ కార్పొరేషన్‌పై సమీక్ష నిర్వహించడం ఏంటనీ ప్రశ్నించారు. కరీంనగర్ ప్రజలు 3 సార్లు ఓడగొట్టారని విధి లేక పక్క జిల్లా సిద్దిపేటలోని హుస్నాబాద్ కు పారిపోయాడని ఆరోపించారు. అలాంటి వ్యక్తికి కరీంనగర్ పై పెత్తనం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ కు కరీంనగర్ తో సంబంధం లేదని అందుకు ఆయనకు సిద్దిపేట జిల్లా అధికారులు కెటాయించిన సెక్యూరిటీయే నిదర్శనమన్నారు. కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉండగా జిల్లాకు సంబంధం లేని వ్యక్తి పొన్నం ప్రభాకర్ సమీక్ష చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కరీంనగర్ ప్రజలు 3 సార్లు ఓడగొట్టారని కసితో ఉన్న పొన్నం, నగర పాలక సంస్థపై బురద జల్లె ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పై పొన్నంకు అంత శ్రద్ద ఉంటే రాజకీయంగా జన్మనిచ్చిన హుస్నాబాద్ పై సమీక్ష పెట్టుకోండని ఉచిత సలహా ఇచ్చారు. మీరు అధికారం లో ఉన్నపుడు ఏమి అభివృద్ధి చేసారో అందరికీ తెలుసన్నారు. కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ నగరపాలక సంస్థ కు 4 కోట్ల క్యాష్ అవార్డు ఇచ్చారని అది మీ కండ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నగరాన్ని సర్వాంగ సుందరముగా తీర్చిదిద్దాం..35 చోట్ల ఓపెన్ జిమ్ లు ఏర్పారు చేసాము...ఇంకా 30 ఏర్పాటు చేస్తామని తెలిపారు. హోదాలో ఉన్న పొన్నం అన్ని తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. అధికారులను పాలక వర్గాన్ని భయపెట్టే మనస్తత్వం మార్చుకోవాలని హితవు పలికారు. కేంద్రం నుండి నిధులు మంజూరు చేయించింది ఎంపీ బండి సంజయ్ అని తెలిపారు. నగర అభివృద్ధికి బండి సంజయ్ సహకరించారు... మీరు ఏమి చేశారో చెప్పండన్నారు. పొన్నం చేసే ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని మేయర్ స్పష్టం చేశారుమంత్రి పొన్నం ప్రభాకర్ పై మేయర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు అగ్గి మీద గుగ్గిలమయ్యారు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో నగరపాలక సంస్థను అవినీతి మయంగా మార్చి మేయర్ కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టారు ఆరోపించారు. అతని నుంచి నగరపాలక సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ లో పుట్టిపెరిగిన వ్యక్తిగా.. రాష్ట్ర మంత్రి గా ఉమ్మడి జిల్లా వాసిగా కరీంనగర్ నగర్ పాలక సంస్థ పనితీరుపై సమీక్ష నిర్వహిస్తే మేయర్ కు ఎందుకు కడుపుమంట అని ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన కార్పోరేటర్ లు తోపాటు కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. నగరపాలక సంస్థ విషయంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ మధ్య పరస్పర ఆరోపణలు విమర్శలు నేతల మధ్య మాటల యుద్ధానికి రాజకీయ కక్ష సాధింపులో భాగమనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ మేయర్ అయిన సునీల్ రావు, ఏ పదవిలో లేని మాజీ ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ నిరసన ఆందోళన చేపడితే పొన్నం ఒక స్క్రాప్ అని విమర్శించారు. ఆ మాటను మదిలో పెట్టుకున్న పొన్నం ప్రస్తుతం మంత్రి కావడంతో తానంటే ఏమిటో నిరూపించేందుకు నగరపాలక సంస్థపై నజర్ వేసినట్లు ప్రచారం జరుగుతుంది. భాగంగానే మున్సిపల్ పై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించడమే కాకుండా గతంలో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపం అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవడంతో పాటు పాలకవర్గాన్ని బద్నాం చేసే ప్రయత్నం జరుగుతుందని నగర ప్రజలు భావిస్తున్నారు. ఒకప్పుడు ఒక్క తాను ముక్కలే అయిన మేయర్, మంత్రి ఇప్పుడు అధికార విపక్షంగా మారి ఆధిపత్యం కోసం రాజకీయ డ్రామాకు తెరలేపారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## శ్రీచైతన్య కాలేజీలో ఏఐవైఎఫ్ ధర్నా

గచ్చిబౌలి, జూన్ 21 (ప్రజాస్వరం) :

కలుషిత ఆహారం తిని కొండాపూర్ లోని శ్రీ చైతన్య(వాల్మీకి) అనధికార ఇంటర్ కళాశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైయారు. వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గురువారం ఉదయం టి నుండి వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపంచారు.

## ప్రజల ఆకాంక్షలు నెరవేరుద్దాం

తాడేపల్లిగూడెం, జూన్ 21 (ప్రజాస్వరం) :

తొలిసారి అసెంబ్లీలో అడిగిడుతున్న తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టితో పవన్ ప్రజలు ఎన్నో ఆశలు ఆకాంక్షలతో కూటమి ప్రభుత్వానికి అఖండ మెజారిటీ ఇచ్చి మనల్ని అసెంబ్లీలోకి పంపారని వారి ఆశలు ఆకాంక్షలు నెరవేర్చే విధంగా పనిచేయాలని తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో శుక్రవారం తొలిసారి అసెంబ్లీకి అడుగెడుతున్న సందర్భంలో బొలిశెట్టితో పవన్ కళ్యాణ్ పై విధంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రజల సమస్యలు, వారి అభివృద్ధి,. నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడతానంటూ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు మెచ్చుకునే విధంగా పాలన సాగిద్దాం నడండి అంటూ పవన్ కళ్యాణ్ కూటమి ఎమ్మెల్యేలను కలుపుకుని అసెంబ్లీలోకి ప్రవేశించారు.

# కాంగ్రెస్‌లో ఉండేదీ ఎవరు



వరంగల్ జూన్ 21 (ప్రజాస్వరం) :

శాసన మండలిలో తమ సభ్యులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ అలర్ట్ అయింది. శాసనమండలిలో మొత్తం 40మంది సభ్యులుండగా వీరిలో 29మంది బీఆర్ఎస్ పార్టీవారే. కాంగ్రెస్‌కు కేవలం నలుగురు ఎమ్మెల్సీలే ఉన్నారు. ఇప్పుడు హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ స్టార్ట్ కావడంతో గులాబీపార్టీలో గుబులు మొదలైంది. త్వరలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఉన్నందున ఎలాగైనా గులాబీదళం బలం తగ్గించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ గట్టి కసరత్తు చేస్తోంది. శాసనమండలిలో పలు కీలక బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అడ్డుపడే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ వారికి గాలం వేస్తోంది. ఇప్పటికే కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. వీరు పార్టీని వీడి కాంగ్రెస్‌తో జతకట్టేందుకు సిద్ధమయ్యారనే టాక్ వినిపిస్తోంది. దీంతో బీఆర్ఎస్ అధిష్ఠానం అలర్ట్ అయింది. ఎవరెవరు పార్టీమారే అవకాశం ఉందో ఆరా తీస్తోంది. ఎమ్మెల్సీలకు సన్నిహితంగా ఉండేవారి నుంచి వివరాలు సేకరిస్తుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తమపార్టీతో చేరితే పదవులు,నిధులు ఇస్తామని కాంగ్రెస్ హామీలు ఇస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తు ఇచ్చినప్పటికీ మరో కొంతకాలం పదవి ఉండాలంటే పార్టీ మారడం శ్రేయస్కరమని కొందరు ఎమ్మెల్సీలు భావిస్తున్నట్టు టాక్. అందులో భాగంగానే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు పలువురు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. కొందరికి పార్టీ అధినేత కేసీఆర్ ఫోన్ చేస్తే వారినుంచి సరైన సమాధానం రాలేదని.. అలాగని పార్టీలో కొనసాగుతామని కూడా చెప్పలేదు. దీంతో 29మంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలలో కనీసం 10మందైనా మిగులుతారా అనే సందేహం కారుపార్టీని తొలిచేస్తోంది. వరంగల్ జిల్లా నుంచి ఎమ్మెల్సీలుగా ఉన్న ఆరుగురు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులుగా పేరుగాంచారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తమ భవిష్యత్తుకోసం పార్టీ మారేందుకు వీరు సిద్ధమవుతున్నట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తీరును, టికెట్ల కేటాయింపును వరంగల్ జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్సీ బహిరంగంగానే తప్పుబట్టారు. ఆయన నియోజకవర్గం ప్రస్తుతం కాంగ్రెస్ కంచుకోటగా మారడంతో పార్టీమారాలని అనుచరగణం ఒత్తిడి చేస్తోంది. మరో ఎమ్మెల్సీపై కూడా అనుచరులు పార్టీ మారాలని ఇలాగే ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌లోకి వస్తే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని రేవంత్‌కు సన్నిహితుడైన ఎమ్మెల్యే ఒకరు ఆ ఎమ్మెల్సీకి చెప్పినట్టు తెలిసింది. ఈ జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్సీకి కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు మంత్రులతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఆయన కూడా కాంగ్రెస్‌లోకి జంప్ చేసే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది.

### విస్తరణలో ఐదుగురికి చోటు..

స్థానిక సంస్థల ఎన్నికల వేళ కేబినెట్ విస్తరణ దృష్టి సారించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్‌తో మంతనాలు జరిపారు. దాదాపు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు అంతర్గత సమాచారం. తెలంగాణలోని ముఖ్యనేతలు ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలతో తమకున్న సంబందాల ద్వారా లాబీయింగ్ మొదలుపెట్టారు. అంతా అనుకున్నట్లు జరిగితే జులై మొదటివారంలో కేబినెట్ విస్తరణ ఉంచవచ్చని అంటున్నారు.ప్రస్తుతం ముఖ్యమంత్రితోపాటు 12 మంది మంత్రివర్గంలో ఉన్నారు. మరో ఐదారుగురు ఛాన్స్ ఉన్నా, ఈసారి ఐదుగురుకి చోటు కల్పించాలని భావిస్తున్నారట. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో కొన్ని జిల్లాలకు ఎక్కువ ప్రాతినిధ్యం దక్కగా, కొన్ని జిల్లాలకు అసలు చోటు లేదు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన నేతలెవ్వరూ లేరు. ఈసారి ఆయా జిల్లాలకు ఛాన్స్ ఇవ్వాలన్నది అసలు పాయింట్. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి చాలామంది జాయిన్ అయ్యారు.. మరికొందరు రేపోమాపో కాంగ్రెస్‌లోకి రావాలని భావిస్తున్నారు. తమకు మంత్రివర్గం లో చోటు లేకపోయినా, మిగతా పదవులు ఇవ్వాలని కోరుతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ సమాచారం.లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు కాంగ్రెస్ పెద్దలు. వారిలో ముక్తల్ నుంచి శ్రీహరికి రావచ్చని అంటున్నారు. రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, ప్రేమసాగర్, సుదర్శన్‌రెడ్డి, మైనార్టీల నుంచి ఒకరు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచి, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత దాన్ని భర్తీ చేయాలని భావిస్తున్నారట సీఎం రేవంత్‌రెడ్డి. కేబినెట్ విస్తరణ తర్వాత నాలుగైదు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నట్లు సమాచారం.

# డైలామాలో.. కేటీఆర్ ఫ్యూచర్



హైదారాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫ్యూచర్ డైలమాలో పడింది. అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించిన గులాబీపార్టీ చిన్నబాస్ లోక్‌సభ ఫలితాల తర్వాత పత్తా లేకుండా పోయారు. అసలే సీఎం సీటు దిగాల్సి వచ్చిందన్న బెంగతో కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు రావడం లేదు. ఇటు చూస్తే ఒక్క ఎంపీ స్థానం కూడా దక్కకపోవడంతో కేటీఆర్ పార్టీ శ్రేణులకు నల్లపూస అయిపోయారు. తీహార్ జైలుకు వెళ్లి చెల్లిన చూసొచ్చిన వెంటనే ఆయనకు ఎన్నికల అఫిడవిట్ ఉచ్చు బిగుసుకుంది. ఆ క్రమంలో ఆయన పోస్టుపై పార్టీలో పెద్ద చర్చే జరుగుతుంది.వరుస ఓటములతో బీఆర్ఎస్ ఉక్కిరి బిక్కిరి అవుతుంది. మరోవైపు వలసలు గులాబీ పెద్దలకు షాక్‌ల షాక్‌లు ఇస్తున్నాయి. దాంతో పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై సమీక్షలు నిర్వహించి.. పార్టీ శ్రేణుల్లో స్థైర్యం నింపాల్సిన భాధ్యత కేటీఆర్‌దే. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కేటీఆరే ఎక్కువ హడావుడి చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడైతే కేసీఆర్ ఢిల్లీ పాలిటిక్స్ చూసుకుంటారు. తానే సీఎం అన్న రేంజ్లో బిల్డప్ ఇచ్చారు. తన వర్గం ఎమ్మెల్యేలతో సీఎం, సీఎం అని నినాదాలు కూడా చేయించుకున్నారు.అయితే ఆ కల్వకుంట్ల దొరలు కన్న కలలు ఒక్కటి కూడా నెరవేరలేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుస పరాభవాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీకి గుడ్‌బై చెపుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన బైపోల్స్‌లో కూడా కారు టైర్లు పేలిపోయాయి. ఆ దెబ్బతో ఇప్పటికే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. మరికొందరు కాంగ్రెస్ లేదా బీజేపీలోకి వెళ్లాలని చూస్తున్నారు. ఇలాంటి కష్టకాలంలో యాక్టివ్‌గా ఉంటూ పార్టీ నాయకులను మరోపార్టీకి వెళ్లిపోకుండా ఆపాల్సిన కేటీఆర్ సైలెంట్ గా ఉండటం ఏమిటన్న విమర్శలు వస్తున్నాయి. అసలు ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్యాపబులేనా? అన్న అనుమానాలు పార్టీ వర్గాల్లోనే వ్యక్తమవుతున్నాయి. ఆయన్ని ఆ పోస్టు నుంచి దించాలని డిమాండ్లు కూడా మొదలయ్యాయి.లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటుతామని బీరాలు పలికిన ఆయన.. ఇప్పుడు అవమాన భారంతో బయటకు రావడం లేదని ప్రత్యర్థి పార్టీలు విమర్శిస్తున్నాయి. మరోవైపు ఎన్నికల అఫిడవిట్‌పై కోర్టు విచారణ , ఫోన్ ట్యాపింగ్ కేసు, గొర్రెల స్కామ్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు, ఇలా బీఆర్ఎస్‌లోని పెద్ద తలకాయల చుట్టూ గట్టిగానే ఉచ్చు బిగుస్తోంది. ఈ పరిస్థితుల్లో కేటీఆర్‌కు పార్టీని హ్యాండిల్ చేసే సినిమా లేదని.. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు తీసి మళ్లీ ఫారిన్ పంపించేస్తే బెటర్ అన్న సూచనలు కూడా వస్తున్నాయంట.ఎంత కాదన్న రెండు టర్మ్‌లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ పార్టీని వదులుకోలేరు. కొడుకు కేటీఆర్ యాక్టివ్ రోల్ పోషించిన లోక్‌సభ ఎన్నికల్లో సొంత జిల్లా మెదక్ లోనూ బీఆర్ఎస్ కు కలిసి రాలేదు. ఇక రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఇటు చూస్తే పార్టీ కేడర్ పూర్తిగా నిరుత్సాహంలో ఉంది. దాంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి మార్పు పైన కేసీఆర్ ఆలోచన చేస్తున్నారంట.ట్రాక్ తప్పిన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి ఎలాగొలా గాడిలో పెట్టడానికి కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పార్టీలో కీలక బాధ్యతల నుంచి తప్పించాలని భావిస్తున్నారంట. కేటీఆర్ స్థానంలో కుటుంబంలోనే మరొకరికి కేటాయించాలా లేదా బయట వ్యక్తులకు ఆ పదవి కట్టబెట్టాలా అనేదానిపై కేసీఆర్ సమాలోచనలు కొనసాగిస్తున్నారంటున్నారు.ఆ క్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు రేసులో హరీష్‌రావు పేరు ఫోకస్ అవుతుంది. హరీష్ కు అప్పగించినా కుటుంబ సభ్యులకే మరోసారి పదవి ఇచ్చారనే విమర్శలు ఎదురయ్యే ఛాన్స్ ఉంది. దీంతో హరీష్ తో పాటుగా ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఎవరినైనా రెండో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయాలని చూస్తున్నారంట. తెలంగాణ వచ్చినప్పుడు దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానని ఎన్నికల ప్రచారంలో ఘనంగా ప్రకటించారాయన. గెలవగానే ఆ విషయం మర్చిపోయారు. ఇప్పుడు రెండో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవైనా ఆ వర్గానికి కేటాయించాలని లీడర్ని వెతుక్కుంటున్నారంట. మొత్తానికి అలా సాగిపోతోంది కారు పార్టీ ప్రయాణం.

### కేటీఆర్ నోటీసులు..

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ కు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నామినేషన్ సందర్భంగా కేటీఆర్ సమర్పించినటువంటి ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు ప్రచారం ఉందంటూ కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి, లగిశెట్టి శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు.. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేటీఆర్ తోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, సిరిసిల్ల రిటర్నింగ్ ఆఫీసర్ కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# ప్రాణం కాపాడిన యాపిల్ వాచ్



కరీంనగర్, జూన్ 21 (ప్రజాస్వరం) :

మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీ అభివృద్ధి చెందుతుంది. స్మార్ట్ పరికరాల హవా కొనసాగుతోంది. ఆరోగ్య సమస్యలను అలర్ట్ చేసేందుకు స్మార్ట్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. స్మార్ట్ వాచీలు, స్మార్ట్ రింగ్ లు , స్మార్ట్ బ్యాండ్ లు ఇలా పేరు ఏదైనా సరే ఫిట్నెస్, హెల్త్ ఇష్యూస్ పై అలర్ట్ చేస్తున్నాయి. ముఖ్యంగా స్మార్ట్ వాచ్ లలో ఫీచర్లు శరీర కదలికలను బట్టి ఫిట్నెస్ లెవల్స్, హార్ట్ బీట్, పల్స్ చెప్పేస్తున్నాయి. దీంతో ఇటీవల స్మార్ట్ వాచ్ ల వినియోగం పెరిగింది. వీటిల్లో ముఖ్యంగా యాపిల్ స్మార్ట్ వాచ్ లకైతే ప్రత్యేక డిమాండ్ ఉంది. వీటిల్లో రీడింగ్స్ కచ్చితత్వం ఉంటాయని ప్రజల్లో నమ్మకం. యాపిల్ వాచ్ ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి సరైన సమయంలో హెచ్చరికలు జారీచేస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాపిల్ వాచ్ బీజేపీ నేత ప్రాణం కాపాడిందిరాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ యాపిల్ వాచ్ వాడుతున్నారు. గత కొంత కాలంగా కొంత దూరం నడిస్తే ఆయాసం, ఛాతిలో నొప్పి, మంటలా ఉన్నా ఆయన పెద్దగా పట్టించుకోలేదు. గ్యాస్ట్రిక్ సమస్య అనుకుని వదిలేశారు. అయితే ఆయన వాడుతున్న యాపిల్ వాచ్ ఓ అలర్ట్ పంపింది. గుండెపోటు ప్రమాదం ఉందని దాని సారాంశం. దీంతో ఆయన నిర్లక్ష్యం చేయకుండా గుండెకు సంబంధించిన ఇబ్బంది ఉందని వరంగల్ వైద్యులను సంప్రదించారు. రామకృష్ణను పరీక్షించిన వైద్యులు గుండెకు సంబంధించిన రెండు రక్తనాళాలు మూసుకుపోయాయని గుర్తించారు. దీంతో ఆయన మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రికి వెళ్లారు. యశోదలో వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్య సేవలు పొందారు. గత కొద్ది కాలంగా వాడుతున్న యాపిల్ వాచ్ తన ప్రాణాలను కాపాడిందని బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ అన్నారు.యాపిల్ వాచ్ ఆరోగ్య పరిస్థితిని తెలియజేసే సామర్థ్యాలను కలిగి ఉందని మరోసారి నిరూపించింది. తీవ్రమైన గుండె పరిస్థితిని గుర్తించడంలో సహాయపడింది. కెనడాకు చెందిన 44 సంవత్సరాల వయసు గల ట్రావిస్ చామర్స్ అనే అగ్నిమాపక సిబ్బంది తన కుమారుడితో కలిసి రోడ్ హాకీ ఆడుతున్నాడు. అతని ఛాతీలో అకస్మాత్తుగా నొప్పి మొదలైంది. తీవ్రమైన తలనొప్పి కూడా వచ్చింది. మొదట్లో ఈ లక్షణాలు ఫ్లూ లేదా అలెర్జీల కారణంగా ఉన్నాయని భావించాడు. చామర్స్ వెంటనే తన హృదయ స్పందన రేటు అసాధారణంగా పెరిగినట్లు తెలుసుకున్నాడు. అతని యాపిల్ వాచ్ నుంచి వచ్చిన నోటిఫికేషన్ తో వెంటనే వైద్యులను సంప్రదించాడు. చామర్స్ యాపిల్ వాచ్ గుండెలో పరిస్థితి సక్రమంగా లేదని, వేగవంతమైన హృదయ స్పందన రేటు ఉందని నోటిఫికేషన్ పంపింది. ఇది స్ట్రోక్, గుండె ఆగిపోయే ప్రమాదాన్ని పెంచుతుందని తెలిపింది. దీంతో వైద్యులను సంప్రదించగా.. గుండెలో సమస్య ఉందని గుర్తించి చికిత్స అందించారు. యాపిల్ స్మార్ట్ వాచ్ తన ప్రాణాన్ని కాపాడిందని చికిత్స తర్వాత అతడు స్థానిక మీడియాతో చెప్పాడు.

## అనంతలో.. కాడెడ్లుగా చిన్నారులు

అనంతపురం, జూన్ 21 (ప్రజాస్వరం) :

వ్యవసాయంపై మక్కువ ఆ రైతును నిలవనీయలేదు. ఆ స్థోమత లేకపోయినా బిడ్డల్నే కాడెద్దులుగా చేసి పొలంలో కలుపు మొక్కలు తీశాడు. ఇప్పుడు ఈ దృశ్యాలు వైరల్‌గా మారుతున్నాయి. బడికి పోవాల్సిన ఆ చిన్నారులు కాడెద్దులుగా మారిన ఘటన అనంతలో రైతులు పడుతున్న కష్టానికి ఉదాహరణగా చెబుతున్నారు. రాయలసీమ జిల్లాల్లో వర్షాలు పడటంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. పెరిగిపోయిన ఖర్చులకు తగిన ఆదాయం లేక చాలా మంది రైతులు తమ వద్ద ఉన్న ఎద్దులు, ఇతర సామాగ్రి అమ్మేశారు. కొందరు పొలాలను కూడా వదిలించుకున్నారు. కానీ మరికొందరు భూమిపై ఉన్న మక్కువతో ఖర్చులు సాగును మాత్రం కొనసాగిస్తున్నారు. అలాంటి ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తిరుగుతున్నాయిప్రస్తుత కాలంలో రైతులకు వ్యవసాయం గుదిబండల మారింది. వర్షాలు వచ్చాయంటే చాలు రైతులు ఎన్నో ఆశలతో పొలాల్లో సాగుకు సిద్ధమవుతారు. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయ ఖర్చులు అధికం అవుతుండడం రైతులకు భారంగా మారుతుంది. విత్తనం వేసుకోవడానికి ముందుగా తమ పొలాలలో సేద్యం, కలుపులు తీసుకోవడం కూలీల ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే వర్షం ఇచ్చిన ఆనందం కంటే సాగు ఖర్చులు తలచుకొని భయపడాల్సి వస్తుంది. మన చూసిన ఈ ఫొటోలు అనంతపురం జిల్లా కంబదూరు మండలం నూతిమడుగు గ్రామంలో శార్దానప్ప అనే రైతు తన పొలంలోనిది. టమాటో పంట సాగు చేసే శార్దానప్ప ఈసారి కూడా పంట వేసేందుకు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పొలంలో కలుపు మొక్కలు పెరిగాయి.కలుపు మొక్కలు తొలగించేందుకు కూలీలను పురమాయించాలి. దానికి చాలా ఖర్చు చేయాలి. దున్నించాలి అంటే ఎద్దులు లేకపోయే. వేరే వాళ్లకు చెబితే బాడుగ ఎక్కువ ఇవ్వాలి. ఎద్దులు కొనే స్తోమలేని రైతు కుటుంబం సాయం తీసుకున్నాడు. ట్రాక్టర్‌తో సేద్యం చేయించాలంటే కూడా ఖర్చు మేపెడు అవుతుంది. పొలాన్ని వదిలేద్దామా అంటే మనసు ఒప్పుకోవడం లేదు. చేసేదిలేక కలుపు తీసేందుకు తన ఇద్దరు కుమారుల సాయం తీసుకున్నాడు. వారినే కాడెద్దుల్లా మార్చాడు. పుస్తకం పట్టి చదువుకోవలసిన బిడ్డలు ఇలా కాడె పడుతుంటే మనసు చివుక్కుమన్నా శార్ధనప్పకు తప్పలేదు. ఆయన పెద్ద కుమారుడు కార్తీక్ ఇంటర్ చదువుతున్నాడు. రెండో కుమారుడు రాణా ప్రతాప్ పదో తరగతి చదువుతున్నాడు. పని పూర్తి అయిన తర్వాత వారిని చదువుకు పంపించాడు. వీరిద్దరితో శార్ధనప్ప తన టమోటా పంటలో పెరిగిన కలుపు మొక్కలు తీయించాడు. స్థానిక రైతులు వారి వీడియో ఫోటోలను తీశారు. ఇవి అనంతపురం జిల్లాలోని రైతుల కష్టాలకు అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. చిన్నారులు పొలంలో కలుపు నివారణకు తండ్రితోపాటు కాడెడ్లుగా మారి చిత్రాలు చూసినా స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్పందించారు. వెంటనే ఇద్దరు చిన్నారులను తాను చదివిస్తానని చెప్పారు. వ్యవసాయ ఖర్చులు కూడా తానే భరిస్తానని ఎమ్మెల్యే ఆ రైతు కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# భరోసా ఇచ్చేందుకు యాత్ర



**విజయవాడ, జూన్ 21 (ప్రజాస్వరం) :**

వైసీపీ అధినేత జగన్ ఓదార్పు యాత్ర చేపట్టడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమిని తట్టుకోలేక మరణించిన వారి కుటుంబాలను, రాజకీయ దాడుల్లో గాయపడిన వారిని పరామర్శించాలని జగన్ నిర్ణయించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గురువారం జగన్ అధ్యక్షతన వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగన్ ప్రధానంగా పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులపై జరుగుతున్న దాడులపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో మాట్లాడిన జగన్ ఓటమి భావనను మరిచిపోవాలని నేతలకు సూచించారు. అంతే కాకుండా ప్రతీ ఇంటికీ తలెత్తుకుని పోవాలని తెలిపారు. కాలం గడిచే కొద్దీ మళ్లీ ప్రజల అభిమానం వ్యక్తం అవుతుందని, భవిష్యత్తులో రికార్డు స్థాయిలో గెలుస్తామని చెప్పుకొచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ సానుభూతి పరుల మీద, కార్యకర్తల మీద దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వారందరికీ భరోసా ఇవ్వాల్సిన బాధ్యత పార్టీపై ఉందని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాజకీయ దాడుల్లో గాయపడిన వారితో పాటు వైసీపీ ఓటమి బాధతో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించాలని జగన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఓదార్పు యాత్ర కారణంగా క్రింది స్థాయిలో ఉండే నేతలు, కార్యకర్తలకు భరోసా ఇవ్వడంతో పాటు రాజకీయ పోరాటానికి శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పొందింది. జగన్‌కు వయసుతోపాటు సత్తువ కూడా ఉందని చెప్పుకొచ్చారు. ప్రజలతో కలిసి చేసే పోరాటాల్లో వైఎస్సార్‌సీపీకి, జగన్‌కు ఎవ్వరూ సాటిరారని అన్నారు. ప్రజలకు మరింత దగ్గరయ్యే కార్యక్రమాలు చేస్తామని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్నవారి పాపాలు పండే కొద్దీ ప్రజలతో కలిసి%ౌ% నిలబడి చేసే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో ఊపందుకుంటాయన్నారు. శిశుపాలుడి పాపాలు పండినట్టుగా ఇప్పటికే చంద్రబాబు పాపాలు పండుతూనే ఉన్నాయని కామెంట్స్ చేశారు. ఓటమి భావనను మరిచిపోవాలని నేతలకు జగన్ సూచించారు. మంచి చేశామని%ౌ% ప్రతీ ఇంటికీ కూడా మనం తలెత్తుకుని పోగలమన్నారు. కాలం గడిచే కొద్దీ మన పట్ల మళ్లీ అభిమానం వ్యక్తమవుతుందని%ౌ% మళ్లీ మనం రికార్డు మెజార్టీతో గెలుస్తామని చెప్పుకొచ్చారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా మన కార్యకర్తలమీద, సానుభూతి పరులమీద దాడులు చేస్తున్నారని, ఆస్తులను కూడా ధ్వంసం చేస్తున్నారని అన్నారు. వారందరికీ నేతలు భరోసా ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ప్రతీ అభిమానికీ, కార్యకర్తకూ భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంటుందని గుర్తు చేశారు. ఈ భేటీకి పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులతో పాటు గెలిచిన ఎమ్మెల్యేలు హాజరయ్యారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు నేతలు తోడుగా ఉండాలని జగన్ దిశానిర్దేశం చేశారు. రాజకీయదాడుల్లో గాయపడిన వారిని పరామర్శించాలని%ౌ% వారిలో ఆత్మస్థైర్యం నింపాలని సూచించారు. రాబోయే రోజుల్లో తాను కూడా నేరుగా వచ్చి కార్యకర్తలను కలుస్తానని చెప్పారు. ప్రతీ కార్యకర్తనూ కలిసి వారికి భరోసానిచ్చే కార్యక్రమం చేస్తానని చెప్పుకొచ్చారు. మన పార్టీ కోసం కష్టపడుతూ%ౌ%. జెండాలు మోసిన కార్యకర్తలకు అండగా ఉండాలని జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఉన్నవారి నుంచి ప్రలోభాలు ఉంటాయని%ౌ%. వాటి ఎదుర్కొనే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులకు తోడుగా ఉండాలని చెప్పారు. కార్యకర్తలను, నేతలను పిలిచి మాట్లాడాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని%ౌ%. ఓటమిని మరిచిపోయి పని చేసుకోవాలన్నారు. 175 సీట్లు సాధిస్తామని ధీమాగా చెప్పిన వైసీపీ నేతలు 11 సీట్లలో మాత్రమే గెలిచి.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేదు. భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి పెట్టిన జగన్ వైసీపీ నేతలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరినీ ఈ సమావేశానికి ఆహ్వానించి వారికి దిశానిర్దేశం చేశారు.

## రెండున్నరేళ్ల తర్వాత అసెంబ్లీకి సీఎం చంద్రబాబు

**అమరావతి, జూన్ 21 (ప్రజాస్వరం) :**

ఏపీ సీఎం చంద్రబాబు రెండున్నరేళ్ల తర్వాత అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. సీఎంగానే మళ్లీ సభలో అడుగు పెడతానని 2021లో ఆయన శపథం చేశారు. దాన్ని నిలబెట్టుకుంటూ ఆయన శుక్రవారం అసెంబ్లీలో అడుగుపెట్టారు. అసెంబ్లీకి ప్రణమిల్లి లోపలికి వెళ్లారు. మరికాసేపట్లో చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ తో పాటు ఎమ్మెల్యేలంతా ప్రొటెం స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసారు.

## ఓయూలో యోగా కార్యక్రమం


**హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) :**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీలో స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని పాల యోగాసనాలు వేశారు. యోగా గురువులు యోగా ప్రాముఖ్యతను వివరించి మెళకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం మాట్లాడుతూ యోగాతో మానసిక ఉల్లాసం, శరీర దృఢ త్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ విధిగా యోగాను అలవాటూ చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య తెలంగాణ కోసం అన్ని సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు యోగా అలవాటు చేసే దిశగా, యోగ టీచర్లను నియమించినందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

# చంద్రబాబుకు ఆర్థిక సవాళ్లు

**విజయవాడ, జూన్ 21 (ప్రజాస్వరం) :**

ముఖ్యమంత్రిగా అధికార బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రస్తుత పరిస్థితుల్లో అనేక సవాళ్లను ఎదుర్కొనున్నారు. టీడీపీ కూటమిలో జనసేన, బీజేపీ ఉన్నాయి. వాటితో సంప్రదించే ఏ నిర్ణయమైనా తీసుకోవాలి. ఆ పార్టీలు అడ్డు చెబితే, ఆ నిర్ణయం అమలుకు నోచుకోదనేది స్పష్టం. చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పేరుతో భారీగా సంక్షేమ పథకాలను ప్రకటించారు. వాటి అమలుకు ఏడాదికి దాదాపుగా రూ.80 వేల కోట్లు నుంచి రూ.లక్ష కోట్లు వరకు అవుతాయని అంచనా. గత ప్రభుత్వం ఇచ్చిన కొన్ని సంక్షేమ పథకాలకే ఐదేళ్లలో రూ.2.70 లక్షల కోట్లు ఖర్చు చేశారు. అయితే టీడీపీ కూటమి ఇచ్చిన హామీలతో ఏడాదికి దాదాపుగా రూ.80 వేల కోట్లు నుంచి రూ.లక్ష కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతం కంటే ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుంది. మరోవైపు ఏపీలో ఆర్థిక పురోగతి ఆశించినంతగా పెరగటం లేదు. పథకాలను అమలు చేస్తే అప్పులు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటికీ లోటు బడ్జెట్ కనబడుతుంది. సంక్షేమ పథకాల్లో ప్రధానంగా 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఇవ్వాలి. ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు మహిళలకు ఏడాదికి రూ.18,000 ఇచ్చారు. కానీ చంద్రబాబు ఏకంగా 19 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు వరకు గల మహిళలకు ఇస్తానన్నారు. దీనివల్ల ఇప్పుడున్న లబ్ధిదారుల సంఖ్య మూడింతలు, నాలుగింతలు పెరిగే అవకాశం ఉంది. ఇది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుంది. అలాగే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆర్టీసీ నష్టాల్లో ఉంది. ఇప్పుడు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తే, ఆర్టీసీ మరింత నష్టాల్లోకి వెళుతుంది. ఉచిత బస్ ప్రయాణానికి అయిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. దీనివల్ల ఆర్థికంగా భారం పడనుంది. అమ్మఒడి పథకంతో ప్రస్తుతం స్కూల్‌కి వెళ్లిన విద్యార్థికి ఏడాదికి రూ.15,000 ఇస్తున్నారు. ఇది కుటుంబంలో ఒక విద్యార్థికే ఇస్తున్నారు. అయితే ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే, అంతమందికీ 'తల్లికి వందనం' కింద ఏడాదికి రూ.15,000 ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనివల్ల లబ్ధిదారులు సంఖ్య భారీగా పెరుగుతుంది. ఫలితంగా ఆర్థిక భారం పెరుగుతుంది. అలాగే సామాజిక పెన్షన్ రూ.3,000 నుంచి రూ.4,000లకు పెంపు, అలాగే వికలాంగుల పెన్షన్ రూ.6,000 పెంపు, బీసీలకు 50 ఏళ్లకు పెన్షన్ ఇస్తానని ప్రకటించారు. దీనివల్ల పెన్షన్ లబ్ధిదారులు నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఇప్పుడు పెన్షన్ 60 ఏళ్లు నిండిన వారికి ఇస్తున్నారు. అంటే పదేళ్ల వ్యవధిలో నాలుగు రెట్లు లబ్ధిదారులు పెరుగుతారు. దీనివల్ల ఆర్థిక భారం భారీగా పెరుగుతుంది. నిరుద్యోగ భృతి నెలకు మూడు వేలు ఇస్తామని ప్రకటించారు. దీనివల్ల కూడా ఆర్థిక భారం పడనుంది. కోట్ల రూపాయాలు ఖర్చు కానుంది. అలాగే రైతులకు ఏడాదికి రూ.20 వేలు హామీ అమలు చేయాలంటే, చాలా వరకు నిధులు అవసరం అవుతాయి. అయితే ఇందులో రూ.6,000 కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఇస్తుంది. మిగిలిన రూ.14,000 రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. ఇందుకోసం కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. అన్నా క్యాంటీన్లు వంటి వాటికి కూడా కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. నిరుద్యోగం భృతి పేరుతో ప్రతి నెల నిరుద్యోగ యువతకు రూ.3,000 ఇస్తామన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు లక్షల్లో ఉన్నారు.



దీనివల్ల కూడా కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉందిసంక్షేమ పథకాలతో ఆర్థిక భారం పెరగడంతో పాటు అప్పులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. రాష్ట్ర విభజన జరిగిన తరువాత వచ్చిన అప్పులతో పాటు చంద్రబాబు హయంలో కూడా భారీగా అప్పులు పెంచేశారు. చంద్రబాబు తరువాత జగన్మోహన్ రెడ్డి కూడా అప్పులు చేశారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబే పీఠం ఎక్కారు. సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడానికి అప్పులు భారీగా పెరుగుతాయి. రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణం వంటివి కూడా చేయాల్సి ఉంది.

## చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే భార్య ఆత్మహత్య

**మేడ్చల్, జూన్ 21 (ప్రజాస్వరం) :**

చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపా దేవి ఆత్మహత్య చేసుకున్నారు. అల్వాల్ లోని పంచశీల కాలనీలోని నివాసంలో ఆమె ఉరి వేసుకున్నారు. రూపాదేవి వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రూపాదేవి దంపతులకు ఇద్దరు పిల్లలు కాగా.. ఆమె రెండు రోజుల నుంచి స్కూలుకు వెళ్లలేదని సమాచారం రమాదేవి ఆత్మహత్య అర్ధరాత్రి బయటకు వచ్చింది. ఆత్మహత్యకు ముందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు భార్య వీడియో కాల్ చేసారు.బుధవారం అల్వాల్ నుంచి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొప్పదండికి వెళ్లగా, సాయంత్రం ఆయనకు రూపాదేవి వీడియో కాల్ చేసి చనిపోతున్నానని చెప్పారు. మేడిపల్లి సత్యం ఇంటికి చేరుకునేలోపే ఆమె ఆత్మహత్య చేసుకోగా, విగతజీవిగా పడి ఉన్న భార్యను చూసి సత్యం బోరున విలపించారు.

# తెరపైకి జగన్ విలాస జీవితం

**విశాఖపట్టణం, జూన్ 21 (ప్రజాస్వరం) :**

మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో సరిగ్గా రోడ్లను వేయలేకపోయారు. వాటికి కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేకపోయారు. నిధుల లేమి కారణంగా ఎన్నో ప్రాజెక్టులు ఆగిపోయాయి. గ్రామాల్లో వాటర్ ట్యాంకర్లు సరఫరా చేసినందుకు కోవిడ్ సమయంలో పేషంట్లకు భోజనాలు సరఫరా చేసినందుకు బిల్లులు చెల్లించాలని కానీ ప్రభుత్వం ఇవ్వడం లేదని చిన్న చిన్న కాంట్రాక్టర్లు లక్షల సంఖ్యలో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. ప్రతీ వారం అప్పులు తీసుకు వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ వివరాలు బయటకు రావడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఏపీలో సీఎంగా జగన్ ఉన్నప్పుడు ఇష్టపడి కట్టుకున్న రుషికొండ ప్యాలెస్ ఇప్పుడు దేశంలో వైరల్ టాపిక్ గా మారింది. 61ఎకరాల్లో మొత్తం ఏడు బ్లాకులు నిర్మించారు. లోటులో ఉన్న రాష్ట్రం... వారానికి మూడు, నాలుగు వేల కోట్లు ఆర్బీఐ దగ్గర అప్పు తీసుకు రానిదే రోజు గడవని రాష్ట్రంలో జగన్ తాను విశాఖ నుంచి పరిపాలన చేయాలన్న కోరికతో ఈ క్యాంప్ ఆఫీస్‌ను నిర్మించుకున్నారు. జాతీయ మీడియా చానళ్లన్నీ జగన్ ప్యాలెస్ పై ప్రత్యేక కథనాలు ప్రసారం చేస్తున్నాయి. ఈ భవనంపై జరుగుతున్న ప్రచారం అబద్ధమని చెప్పేందుకు కొంత మంది వైసీపీ నేతలు ఇంగ్లిష్ చానళ్లతో మాట్లాడుతూ ఇది జగన్ సొంత భవనం కాదని ప్రభుత్వ భవనం అంటున్నారు. ల అది రాష్ట్రపతి, ప్రధానుల విడిది కోసమంటూ చెబుతున్నారు. అయితే రాష్ట్రపతి , ప్రధానులు వస్తే ఎక్కడుండాలో వారికి ప్రత్యేకమైన విడిది నేవల్ బేస్‌లో ఉంటుందని గుర్తు చేస్తున్నారు. చేసిన తప్పును సమర్థించుకోవడానికి వారిపైకి నిందలేయడంపైనా విమర్శలు వస్తున్నాయి. ఒక్క విశాఖ రుషికొండ ప్యాలెస్ మాత్రమే కాదు.. తాడేపల్లి ప్రస్తుతం జగన్ ఉంటున్న నివాసంలోనూ పదుల కోట్లలో ఖర్చు పెట్టి సౌకర్యాలు కల్పించుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ప్రస్తుతం వినియోగిస్తున్న ఫర్నిచర్, ఇతర సామగ్రి కూడా ప్రజాధనంతో కొనుగోలు చేసినవే.. దాన్ని సీఎం క్యాంపు కార్యాలయంగా ప్రకటించిన తర్వాత హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ నుంచి హెచ్ బ్లాక్ నుంచి యూపీఎస్, కంప్యూటర్లను అక్కడికి తరలించారు. ఆయన మాజీ ముఖ్యమంత్రిగా మారిన తర్వాత క్యాంపు కార్యాలయంలో రాజకీయ భేటీలు మాత్రమే నిర్వహిస్తున్నారు. దాన్ని ప్రస్తుతం వైసీపీ కేంద్ర కార్యాలయంగా మార్చుకున్నారు. ప్రజాధనంతో కొనుగోలు చేసిన ఫర్నిచర్, ఇతర సామగ్రినే అక్కడ వాడుతున్నారు. ఇక కిటికీలు, వ్యాకట్టర్లు, ఏసీలు సహా మొత్తం ప్రజాధనంతోనే కొనుగోలు చేశారు. జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రజాధనం వినియోగించి పెద్ద ఎత్తున



నిర్మాణాలు చేపట్టారు. ఆ భవనం ప్రైవేటు కట్టడం అయినప్పటికీ భద్రత పేరుతో ఇంటి చుట్టూ ప్రహరీపై 20 అడుగుల ఎత్తులో ఐరన్ ఫెన్సింగ్ ప్రజాధనతోనే చేయించుకున్నారు. అమరావతిలో 8 కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రజావేదికకు అనుమతులు లేవని కూల్చివేయించి.. తన విధ్వంస పాలన మొదలుపెట్టారు జగన్ అయితే మరోసారి సీఎం అవుతానన్న ఓవర్ కాన్ఫిడెన్స్‌తో విశాఖకు రాజధాని మార్చాలని రుషికొండలో ఎలాంటి అనుమతులు లేకుండానే రాజప్రసాదం కట్టించారు .. దానిపై కేసులు పెడితే కోర్టుకు కూడా తప్పుడు సమాచారం అందించారు. పర్యావరణ ఉల్లంఘనలు జరిగాయని ఇప్పటికే హైకోర్టు నియమించిన కమిటీ తేల్చింది. హైకోర్టు నిర్ణయం రావాల్సి ఉంది. ఇవి మాత్రమే కాదు.. జగన్ కుటుంబానికి చెందిన సాక్షి దినపత్రిక, భారతి సిమెంట్స్ కూడా అత్యధిక కొనుగోలు దారు ఏపీ ప్రభుత్వమే. సాక్షి పత్రిక సర్క్యులేషన్ లో సగానిపైగా ప్రజల డబ్బుతోనే కొనపించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, వాలంటర్లు ఇలా అందరితో కొనిపించారు. ఇక భారతి సిమెంట్స్ గురించి చెప్పాల్సిన పని లేదు. ఏపీలో జరిగిన ప్రతి నిర్మాణానికి భారతి సిమెంట్స్ వాడారు. రేటు పెంచి మరీ అందరూ కొనుగోలు చేసేలా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడికి వెళ్లాలన్నా స్పెషల్ ఫ్లైట్లే. రెండు కిలోమీటర్లకు హెలికాప్టర్ రైడ్ ఉపయోగ్సితారు. ప్రజాధనాన్ని ఇలా సొంతానికి వాడుకున్న ఒక్కరంటే ఒక్క సీఎం కూడా చరిత్రలో ఉండరన్న విమర్శలు అందుకే వస్తున్నాయి. ముఖ్యమంత్రి అయితే మాత్రం ఇంత విచ్చలవిడిగా ప్రజాధనాన్ని సొంత ఖర్చులకు ఎలా చేసుకుంటారన్న ప్రశ్నలు సామాన్యుల దగ్గర నుంచి వస్తున్నాయి. ముఖ్యమంత్రి ప్రజాసొమ్ముకు కస్టోడియన్. ప్రజలు శ్రమ చేసి రూపాయి రూపాయి పన్నులుగా కడితే వచ్చే సొమ్మును అంతే జాగ్రత్తగా ప్రజోపయోగం కూడా వాడాలి. ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారంటే.. తనకు ప్రజల సొమ్ముపై తనకు పేటెంట్ ఉన్నట్లు ఇష్టానుసారం ఖర్చుచేయడానిక అవకాశం లేదు. కానీ ఇప్పుడా ఆలోచన అధికారంలోకి వచ్చే వారికి ఉండటం లేదు.

**బయిటకు వస్తున్న దుబారా ఖర్చులు..**

తమిళనాడులో అధికారంలోకి వచ్చిన స్టాలిన్ దుబారా ఖర్చులు తగ్గించేందుకు అనేక సంస్కరణలు చేపట్టారు. అసెంబ్లీలో క్యాంటీన్ ను మూయించారు. మంత్రుల నుంచి ఎమ్మెల్యేల వరకు ఎవరికి వారు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రజా ప్రతినిధులకు ఇష్టం లేకున్నా.. ప్రజల మధ్య చులకన అవుతామని భావించి ఎవరూ నోరు మెదపలేదు. కానీ తాను ఒక నిరుపేద ముఖ్యమంత్రినని.. పెత్తందారులతో పెద్దయుద్ధమే చేస్తున్నానని నిన్నటి వరకు ఏపీని పాలించిన జగన్ చెప్పుకొచ్చారు. కానీ ఆయన అధికారం నుంచి దూరమైన నాటి నుంచి ఆయన పేద కాదు.. ధనిక సీఎం అని ఒక్కొక్క ఘటన వెలుగులోకి వస్తోంది. మొన్నటికి మొన్న రుషికొండలో కళ్ళు బైర్లు కమ్మే నిర్మాణాలు బయటకు వచ్చాయి. 500 కోట్ల రూపాయలతో నిర్మించిన ఆ భవనాల్లో ప్రతి కట్టడం ఒక అద్భుతమే. ఆ విషయం అలానే ఉండగా.. జగన్ సర్కార్ కౌన్సిల్ సమావేశం నాడు టీ ఖర్చు అక్షరాలా రూ.4,12,000 (నాలుగు లక్షల 12 వేల రూపాయలు).ఒక్కరోజులో నాలుగు లక్షల రూపాయల విలువ చేసే టి, కాఫీ తాగేసారంటే ఈ పేద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎంత ఆకలితో ఉన్నారో అర్థమవుతుంది. అయితే ముందస్తుగానే అంచనా వేసి మరి టీ, కాఫీ కోసం నిధులు కేటాయించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 2021 డిసెంబర్ 10న కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆరోజు టి, కాఫీ, స్నాక్స్ ఖర్చు కోసమని రూ.4,12,000 అవసరమని ముందుగానే ఎస్టిమేషన్ తయారు చేశారు. ప్రస్తుతం ఈ ఎస్టిమేషన్కు సంబంధించి ధ్రువీకరణ పత్రం ఒకటి సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. ఒక్కరోజులో అంత ఎలా తాగారు రా? నీళ్లు కూడా తాగకుండా.. కాఫీ,టీలు మాత్రమే తాగారా ఏంట్రా? అంటూ నెటిజెన్లు కామెంట్లు పెడుతున్నారు. ముఖ్యంగా టిడిపి శ్రేణులు ట్రోల్ చేస్తున్నారు. ఆంధ్ర పేద రాష్ట్రం అని చెప్పుకునే జగన్ దీనికి సమాధానం చెప్పాలన్న డిమాండ్ పెరుగుతోంది. సిబిఎన్ ఎగైన్ పేరిట పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. రుషికొండలో నిర్మాణాల విషయంలోనే వైసీపీ చుట్టూ పెద్ద ఎత్తున వివాదాలు నడుస్తున్నాయి. అక్కడ నిర్మాణాలు, కట్టడాలు.. ఇలా ఒకటేమిటి ప్రతి అంశము వైరల్ గా మారింది. వైసీపీ నుంచి దిద్దుబాటు చర్యలకు నేతలు దిగుతున్నా ప్రజల్లోకి బలంగా చర్చికెళ్ళింది. ఇప్పుడు టీ, కాఫీ, స్నాక్స్ అంటూ ప్రచారం ప్రారంభమైంది. వైసీపీ హయాంలో జరిగిన దుబారా ఖర్చు బయట పెట్టాలన్నది లక్ష్యంగా కనిపిస్తోంది. మున్ముందు ఇలాంటి పోస్టులు మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తానికైతే ఇప్పుడు సోషల్ మీడియాలో వైసీపీ దుబారా ఖర్చు హైలెట్ అవుతోంది.

# ఆ రెండు టీడీపీ కోటాలోకే

## 45 నుంచి 40కి తగ్గిన బలం

**విజయవాడ, జూన్ 21 (ప్రజాస్వరం) :**

ఎన్నికల ముందు నలుగురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేసిన వైసీపీ తన గొయ్యి తానే తవ్వుకున్నట్లైంది. ఎమ్మెల్యే కోటాలో ఇద్దరు, స్థానిక సంస్థల కోటాలో గెలుపొందని మరో ఇద్దరిని అనర్హులుగా ప్రకటించడంతో మండలిలో వైసీపీ బలం తగ్గింది. వేటు వేయకుండా ఉంటే కనీసం ఆ నలుగురు టెక్నికల్‌గా అయినా వైసీపీ సభ్యులుగా సభలో ఉండేవారు. ఇప్పుడు ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఆ రెండు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వైసీపీకి సభలో కనీసం పోటీ చేసే బలం కూడా లేకపోవడంతో ఆ రెండు స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. టీడీపీ నుంచి మండలిలో అడుగుపెట్టే ఆ ఇద్దరు ఎవరనేది ఆసక్తికరంగా మారింది.ఎన్నికలకు ముందు టీడీపీకి మద్దతు పలికారని ఎమ్మెల్సీలపై అర్ధరాత్రి పూట అనర్హతా వేటు వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది వైసీపీ ప్రభుత్వం.. అయితే అది ఆ పార్టీకే రివర్స్ అవుతోంది. ఎందుకంటే ఆ ఖాళీలన్నీ టీడీపీ ఖాతాలో చేరిపోతున్నాయి. మొత్తం నలుగురు ఎమ్మెల్సీలపై అనర్హతా వేటు వేశారు. అందులో ఎమ్మెల్యే కోటాలో ఇద్దరు ఉన్నారు. మరో ఇద్దరు స్థానిక సంస్థల కోటాలో గెలిచారు. కడప జిల్లాకు చెందిన సి.రామచంద్రయ్య, అనంతపురం జిల్లాకు చెందిన ఇక్బాల్ ఎమ్మెల్యే కోటాలో వైసీపీ ఎమ్మెల్సీలుగా గెలిచారు. వారిద్దరు టీడీపీలో చేరడంతో అనర్హత వేటు వేయించారు జగన్.ఆ ఇద్దరు రాజీనామాలు ఇచ్చినా అనర్హతా వేటు వేయించారు. ఇప్పుడు ఉపఎన్నికల షెడ్యూల్ వచ్చింది. ఏపీలో రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికలకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 25న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు జులై 2 తుది గడువిచ్చింది. ఉపసంహరణకు ఆ నెల 5 వరకు గడువు ఉంది. జులై 12న పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడి కానున్నాయి.ఇప్పుడు ఉన్న బలాబలాలను చూస్తే 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్న వైసీపీకి అసలు పోటీ చేసే చాన్స్ కూడా లేదు. అంటే రెండు స్థానాలు ఏకగ్రీవం అవుతాయి. అనర్హతా వేటు వేయకపోతే.. కనీసం సాంకేతికంగా అయినా వారు వైసీపీ సభ్యులుగా ఉండేవారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తామన్న ధీమాకు పోయి.. ఆ అవకాశాన్ని కూడా




కోల్పోయింది.2018లో వైసీపీలో చేరిన సి.రామచంద్రయ్యను. 2021లో ఎమ్మెల్సీ పదవి వరించింది.ప్రస్తుతం ఆయనకు మరో మూడేళ్లకుపైగా పదవీకాలం ఉంది. టీడీపీలో రాజకీయం జీవితం ప్రారంభించి మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన రామచంద్రయ్య తర్వాత పీఆర్పీ బాట పట్టి.. దాని విలీనం తర్వాత కాంగ్రెస్ చలవతో ఎమ్మెల్సీ అయ్యి, మరో సారి మంత్రిగా కూడా పనిచేశారు .. తర్వాత వైసీపీలో చేరి పదవి దక్కించుకున్నారు. కాంగ్రెస్, వైసీపీల్లో ఉన్నప్పుడు ఆయన చంద్రబాబును ఒక రేంజ్లో టార్గెట్ చేసిన చరిత్ర ఉంది. ఆ క్రమంలో ఈ సారి టీడీపీ ఆయనకు మరో అవకాశం ఇవ్వడం డౌటే అంటున్నారు.మరో మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ అనంతపురం జిల్లాలోని హిందూపురం నేత .. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి హిందూపురంలో నందమూరి బాలకృష్ణపై పోటీ చేసి 18 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆయన్ని 2019లో ఎమ్మెల్సీని చేసింది. 2021లో రెండో సారి ఎమ్మెల్యే కోటాలో మరోసారి ఎమ్మెల్సీ అవకాశమిచ్చింది. ఆయన పదవీ కాల 2027 మార్చి వరకు ఉంది. హిందూపురం నుంచి మరోసారి పోటీ చేయాలని భావించిన ఇక్బాల్‌కు జగన్ టికెట్ నిరాకరించడంతో.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరిపోయారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రికమండేషన్‌తో బెంగళూరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దీపికను తీసుకొచ్చి హిందూపురంలో బాలయ్యపై నిలబెట్టిన వైసీపీ బొక్కబోర్లా పడింది. ఇక్బాల్ చేరిక టీడీపీకి ప్లస్ అయి.. 32,597 ఓట్ల మెజార్టీతో బాలయ్య హ్యాట్రిక్ విజయం నమోదు చేశారు. ఆ క్రమంలో ఈ సారి మాజీ ఐపీఎస్ అయిన ఇక్బాల్‌కు మైనార్టీ కోటాలో చంద్రబాబు ఛాన్స్ ఇస్తారంటున్నారు.ఇక రెండో స్థానానికి టీడీపీ ఎవరికి అవకాశం ఇస్తుందనేది ఆసక్తి రేపుతోంది. రేసులో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ముందు కనిపిస్తున్నారు. జనసేనాని పవన్‌కళ్యాణ్ కోసం తన సీటు త్యాగం చేసిన ఆయన పవన్ విజయంలో కీలక పాత్ర పోషించారు. పవన్ 70,279 మెజార్టీతో తొలిసారి ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించడం వెనుక వర్మ పోషించిన రోల్‌ని ఎవరూ కాదనలేదు. అసలు వర్మ సీటు త్యాగం చేసినప్పుడే మొట్టమొదటి ఎమ్మెల్సీ పదవి ఆయనకు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి ఉన్నారు. ఆయన్ని ఎమ్మెల్సీ చేయాలని పవన్ కూడా పట్టబట్టే అవకాశం కనిపిస్తుంది.ఇక విశాఖపట్నంకు చెందిన వంశీకృష్ణయాదవ్ స్థానిక సంస్థల కోటాలో ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన దానికి రాజీనామా చేసి విశాఖ సౌత్ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన రాజీనామాను ఆమోదించకుండా వైసీపీ అనర్హత వేటు వేసి విమర్శలు మూటగట్టుకుంది. విజయనగరం జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా 2021లో ఎన్నికైన ఇందుకూరి రఘురాజుపై కూడా వేటు పడటంతో ఆ స్థానం కూడా ఖాళీ అయింది.58 మంది సభ్యులున్న శాసనమండలిలో వైసీపీకి 45 మంది సభ్యులుండే వారు. ఇప్పుడీ నలుగురూ దూరమయ్యారు. మరోవైపు గుంటూరు జిల్లా నుంచి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఉన్న గురజాల మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి కూడా ఎన్నికల ముందు వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీ ఘోర పరాజయంతో మరింత మంది ఎమ్మెల్సీలు కూటమికి జైకొట్టే పరిస్థితి కనిపిస్తుంది. మొత్తానికి ఇప్పటికైతే కొత్త ప్రభుత్వంలో శాసనమండలి సమావేశాలు మొదలుకు కాకుండానే ఆ పెద్దల సభలో వైసీపీ బలం 45 నుంచి 40కి పడిపోవడం విశేషం.

# ఆగని ఫర్నిచర్ రచ్చ

### మీకో రూల్... మాకో రూలా...అంటూ క్వశ్చన్

**గుంటూరు, జూన్ 21 (ప్రజాస్వరం) :**

అప్పట్లో ఉమ్మడి అసెంబ్లీ ఫర్నిచర్ కొంత అప్పటి స్పీకర్ కోడెల శివప్రసాదరావు క్యాంపు ఆఫీసులో ఉండేది. ప్రభుత్వం మారాక దానిని తీసుకెళ్లాలని.. లేకపోతే ఆ ఫర్నీచర్‌కి ధర చెల్లిస్తానని ఆయాన లేఖ రాసి.. తన తర్వాతి స్పీకర్ తమ్మినేనికి సమాచారం కూడా ఇచ్చారు. అయినా వాటన్నిటినీ పక్కనపెట్టి మాజీ స్పీకర్‌పై దొంగతనం కేసు పెట్టి అవమానించారు. ఇప్పుడు మాజీ సీఎం జగన్ క్యాంపుగా మార్చుకున్న తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రభుత్వ ఫర్నీచరే ఇంకా వాడుతున్నారు. నాడు మాజీ స్పీకర్‌పై దొంగ ముద్ర వేసిన మాజీ సీఎంపైన కూడా అదే దొంగతనం కేసు పెట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.సీఎం అయ్యే నాటికే తాడేపల్లిలో ప్యాలెస్ కట్టుకున్న జగన్ సీఎం అయ్యాక ప్రభుత్వ సొమ్ముతో దాన్ని ముస్తాబు చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే అప్పుడు జగన్ పేషీలో పనిచేసిన కార్యదర్శులు, నామినేటెడ్ సలహాదారులు కూడా ప్రభుత్వ ఫర్నీచర్‌నే వాడుకున్నారు. వారి పదువుల పోయి రోజులు గడుస్తున్నా ఇంకా ఫర్నీచర్ అప్పగించలేదని అధికారుల చెప్తున్నారు. సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ ప్రకారం 15 రోజుల్లో.. ఫర్నీచర్, ఇతర సామాగ్రిని అప్పగించాలని నిబంధన ఉంది. ఆ క్రమంలో వారందరికీ ఫర్నీచర్‌తో పాటు ఇతర సామాగ్రిని పంపాలని జీఏడి నోటీసులు పంపినట్లు ప్రచారం జరుగుతోంది.కోట్లకొద్దీ ప్రజాధనంతో మాజీ సీఎం జగన్ ఇంట్లో ఫర్నిచర్ ఏర్పాటు చేసుకున్నారంటున్నారు. దానికి సంబంధించిన జీఓలు కూడా ఉన్నాయంట. 2019లో టీడీపీ ఓటమి తర్వాత మాజీ స్పీకర్, టీడీపీ సీనియర్ లీడర్ డాక్టర్ కోడెల



శివప్రసాదరావుపై ఫర్నిచర్ దొంగగా ముద్ర వేసి కేసులు పెట్టింది జగన్ సర్కారు. అప్పటి నరసరావుపేట వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో ఫిర్యాదు ఇప్పించి మరీ కేసు నమోదు చేయించారు.అప్పట్లో వివాదాస్పదమైన ఫర్నిచర్ హైదరాబాద్‌లో ఉమ్మడి అసెంబ్లీకి సంబంధించింది. ఏపీ వాటాగా అందులో కొంత ఫర్నిచర్‌ను లారీల్లో అమరావతికి పంపారు. పెద్ద పెద్ద టేబుళ్లు, పాత కుర్చీలు అందులో ఉన్నాయి. అప్పటికే అమరావతిలోని అసెంబ్లీలో పూర్తిస్థాయి ఫర్నిచర్‌ను సమకూర్చుకున్నారు. కొత్త అసెంబ్లీలో పెట్టడానికి ఖాళీ లేకపోవడంతో వాటిని తన క్యాంపు కార్యాలయంలో పెడితే వాడుకుంటానని స్పీకర్ కోడెల చెప్పడంతో దాంతో అక్కడకు పంపారు.2019 ఎన్నికల్లో టీడీపీతోపాటు కోడెల కూడా ఓడిపోయారు. వైసీపీ పగ్గాలు చేపట్టిన వెంటనే కోడెల అసెంబ్లీ కార్యదర్శికి ఫోన్ చేసి తన క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీకి సంబంధించిన ఫర్నిచర్ ఉందని తీసుకెళ్లాలని చెప్పారు. అసెంబ్లీ కార్యదర్శికి ఒక లేఖ కూడా రాశారు. పాత ఫర్నిచర్‌కు రేటు నిర్ణయిస్తే దానిని చెల్లించి తానే ఉంచుకుంటానని అందులో పేర్కొన్నారు. తర్వాత కొత్త స్పీకర్ తమ్మినేని సీతారాంకు కోడెల మరో లేఖ రాశారు. ఈ లేఖ అందినట్లుగా స్పీకర్ కార్యాలయం సిబ్బంది సంతకం కూడా చేశారు.ఈ లేఖలు పక్కన పడవేసి అసెంబ్లీ ఫర్నిచర్‌ను కోడెల దొంగతనం చేశారంటూ కేసు నమోదు చేశారు. అవమానంతో కుంగిపోయిన కోడెల ఆత్మహత్య చేసుకున్నారు. పల్నాడుపులిగా పేరున్న ఆ సీనియర్ లీడర్ అలా మరణించడం పెద్ద కలకలమే రేపింది. ప్రభుత్వం తనపై ఫర్నిచర్ దొంగతనం మోపడంతోనే ఆయన ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు ఆరోపించారు %%% కోడెల తన క్యాంపు కార్యాలయంలో వాడుకొన్న పాత ఫర్నిచర్ మొత్తం విలువ రూ. 2లక్షలకు మించదని అప్పట్లో అసెంబ్లీ వర్గాలు లెక్కగట్టాయి.కోడెల రాజకీయాల్లోకి రాక ముందే స్థితిమంతులు.. నరసరావుపేటలో సొంత కోట ఉన్న ఆయన మంచి పేరున్న డాక్టర్ .. అంత ఆస్తిపరుడిపై ఫర్నిచర్ దొంగతనం కేసు మోపడం టీడీపీ వర్గాలను కలచివేసింది. ఇప్పుడు సరిగ్గా ఇదే పరిస్థితి జగన్‌కు ఎదురైంది. సీఎంగా ఉన్న సమయంలో ఆయన తన తాడేపల్లి ప్యాలెస్లో ఏర్పాటు చేసుకున్న క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ధనంతో కొనుగోలు చేసిన ఫర్నిచర్ వినియోగించుకున్నారు. పదవి నుంచి దిగిపోయిన తర్వాత ఆయన ఆ ఫర్నిచర్‌ను ప్రభుత్వానికి అప్పగించాలి.అయితే ఆ ఫర్నిచర్ ధర ఎంతో చెబితే చెల్లిస్తామని వైసీపీ ఎమ్మెల్సీ పేరిట ప్రకటన వెలువడింది. దానిపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. 'అప్పుడు కోడెలపై ఏం కేసు పెట్టారో ఇప్పుడు జగన్‌పై కూడా అదే కేసు పెట్టాలి' అని ఆ పార్టీ సీనియర్ నేతలు కూడా డిమాండ్ చేస్తున్నారు. మరి మాజీ సీఎం దానిపై ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.

# మత్స్యకార వేషధారణలో నర్సాపురం ఎమ్మెల్యే

**అమరావతి, జూన్ 21 (ప్రజాస్వరం) :**

నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ వినూత్న రీతిలో అసెంబ్లీకి వచ్చారు. జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యే, సాంప్రదాయ మత్స్యకారునిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన బొమ్మిడి నాయకర్ . ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. చేప, వలతో సాంప్రదాయ మత్స్యకారునిగా వినూత్న రీతిలో అసెంబ్లీలోకి అడుగు పెట్టారు.

# హెచ్సియూలో అందోళన

**హైదరాబాద్, జూన్ 21 (ప్రజాస్వరం) :**

నీట్ పరీక్షల లో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా సెంట్రల్ యూనివర్సిటీ దళిత బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళ నన చేపట్టారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దిష్టిబొమ్మ దగ్ధం చేసారు. దళిత బహుజనులకు విద్యకు దూరం చేసే కుట్రాలో భాగంగానే నీట్ అక్రమాలు. ఎన్ టి ఏ నిర్వహిస్తున్న పరీక్షలు అక్రమాల పుట్ట. సెంట్రల్ యూనివర్సిటీలో స్వతహాగా ఎంట్రన్స్ ఎగ్జామ్పుల్ నిర్వహించాలిని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

# అసెంబ్లీకి దూరంగా జగన్..

**విజయవాడ, జూన్ 21 (ప్రజాస్వరం) :**

ఏపీ అసెంబ్లీకి హాజరుపై జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టతనిచ్చారు. వెళ్తానని కానీ.. వెళ్ళనని కానీ సూటిగా సమాధానం చెప్పలేదు. కనీసం పార్టీ ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇవ్వనూ లేదు. కానీ హాజరైతే ఎదురయ్యే పరిణామాల విషయంలో మాత్రం ఆయన ఫుల్ క్లారిటీతో ఉన్నారు. గత ఐదేళ్లుగా చంద్రబాబు అండ్ కోకు ఎదురైన పరిణామాలే తమకు ఎదురవుతాయని జగన్ ఊహించారు.కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదని.. సీటు కూడా కేటాయించారని.. మైకు కూడా ఇవ్వరని గుర్తు చేశారు జగన్. వెళ్లే వాళ్ళు వెళ్లని.. ఉండేవారు ఉండనని జగన్ తేల్చి చెప్పడం విశేషం. ఏపీ అసెంబ్లీ సమావేశాలు రెండు రోజులపాటు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు, వైసీపీ అధినేత జగన్ తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు రేపు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశానికి హాజరు కావాలా? వద్దా? అని జగన్ తర్జనభర్జన పడుతున్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు, ఓడిన అభ్యర్థులు, కీలక నాయకులతో జగన్ భేటీ అయ్యారు. వారితో సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్దామని కొందరు.. వద్దని కొందరు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చివరకు అధినేత జగన్ నిర్ణయానికే వదిలేశారు.175 నియోజకవర్గాలకు గాను వైసీపీ 11 చోట్ల మాత్రమే విజయం సాధించింది. గెలిచిన వారిలో జగన్ ఒకరు. పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె నుంచి ఆయన సోదరుడు ద్వారకానాథ్ రెడ్డి గెలిచారు. మిగతా ఎనిమిది మంది వెనుకబడిన వర్గాలకు చెందిన వారే. బలమైన వాయిస్ ఉన్నవారు ఒక్కరు లేరు. అందుకే అసెంబ్లీకి వెళ్లి ప్రమాణం మాత్రమే చేసి రావాలని నాయకులకు తేల్చి చెప్పారు. తాను కూడా వస్తానని.. తరువాత సభలకు వెళ్లాలా? వద్దా? అనే విషయంపై ఎవరికి వారు నిర్ణయించుకోవాలని సూచించారు. తాను ఎవరిని వద్దని కానీ.. వెళ్లాలని కానీచెప్పబోనని తేల్చి చెప్పారు. ' అసెంబ్లీకి వెళ్లినా మైక్ ఇవ్వరు. పైగా హేళన చేస్తారు. ఇవన్నీ భరించడం అవసరమా? మీ ఇష్టం. వెళ్లే వాళ్లను వద్దని చెప్పను. వెళ్ళమని కూడా చెప్పను. అది మీ ఇష్టం. వెళ్తే కానీ బాగుండదని కొందరు అంటున్నారు. అది మీ ఇష్టానికి వదిలేస్తున్నాను. నేను ప్రజల మధ్యకు వెళ్తాను. ప్రజలతోనే ఉంటాను. మన వాయిస్ ప్రజల మధ్య వినిపిస్తే బాగుంటుందని నేను అనుకుంటున్నా' వన్ టు జగన్ వ్యాఖ్యానించారు. దీంతో జగన్ మాటను జవదాటని వారంతా.. తాము కూడా అసెంబ్లీకి వెళ్లకూడదని దాదాపు ఒక నిర్ణయానికి వచ్చారు.

# వెలుగులోకి వచ్చిన కొత్త దందా

**తిరుపతి, జూన్ 21 (ప్రజాస్వరం) :**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త దందా వెలుగు చూసింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల దందాకు తెర తీసింది. వేల సంఖ్యలో ఉద్యోగుల్ని జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో నియామకాలు చేపట్టారు. అయితే వీటిలో భారీగా అక్రమాలు జరిగినట్టు ప్రభుత్వం భావిస్తోంది. ప్రాథమిక విచారణలో పలు ప్రభుత్వ విభాగాల్లో నకిలీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించినట్టు గుర్తించారు.ఏపీలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం కొత్త కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో రూ.40వేలకు మించి వేతనాలు అందుకుంటున్న వారిని తొలగించాలని అధికారికంగా ఆదేశించారు2014-19 మధ్య కాలంలో నియమితులైన ఉద్యోగుల్ని లక్ష్యంగా చేసుకుని వారిని విధుల నుంచి తొలగించారు. ఆ తర్వాత కావాల్సిన చోట తమ వారిని నియమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో విధివిధానాలు లేకపోవడంతో ఇలా జరిగింది.ఏపీలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభమయ్యాక ఉద్యోగాల భర్తీలో నియమనిబంధనలకు తిలోదకాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అనుసరించాల్సిన విధి విధానాలు ఏవి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అమలు చేయలేదు. రూల్ ఆఫ రిజర్వేషన్, ప్రతిభ ద్వారా ఎంపికల ఊసే లేదు. కేవలం సిఫార్సులు, పైరవీలు, పైసలతో ఉద్యోగాలను దక్కించుకునే పరిస్థితులు చాలాకాలంగా ఉన్నాయి.వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగాల్లో తమ వారిని నియమించుకోడానికి కొత్త మార్గాలను అన్వేషించారు. ఆప్కాస్ పేరిట కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టారు. అన్ని ప్రభుత్వ విభాగాలు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ నియామకాలను కూడా ప్రభుత్వ ఉద్యోగాల తరహాలోనే బహిరంగంగా నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష, ప్రతిభ ద్వారా ఎంపిక చేయాల్సి ఉంటుంది. గత ఐదేళ్లలో ఒకటి రెండు శాఖలు మాత్రమే ఈ తరహాలో ఉద్యోగ నియామకాలు చేపట్టాయి.ఇటీవల ఎన్నికల్లో వైసీపీ పరాజయం పాలవడంతో గత ప్రభుత్వ నియామకాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున అక్రమ నియామకాలు వెలుగు చూస్తున్నాయి. అసలు పనిచేయని వారికి కూడా ఐదేళ్లుగా వేతనాలు చెల్లించినట్టు గుర్తించారు. వైసీపీ తరపున సోషల్ మీడియాలో పనిచేసిన వారికి, వారి కుటుంబ సభ్యులకు కూడా వేర్వేరు విభాగాల నుంచి జీతాలు చెల్లించారు. ఒకే ఇంట్లో భార్యాభర్తలకు కూడా వేర్వేరు ప్రభుత్వ శాఖల నుంచి జీతాలు చెల్లించారు.వైసీపీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, జిల్లాల్లో వైసీపీ నాయకుల తరపున ప్రచారం నిర్వహించే కార్యకర్తలు, అభిమానుల్ని ప్రభుత్వ ఉద్యోగుల జాబితాల్లో చేర్చేశారు. వీరికి వేలల్లో జీతాలు చెల్లించినట్టు కొత్త ప్రభుత్వం గుర్తించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఇలాంటి వందలాది ఉద్యోగుల్ని గుర్తించారు. వీరిలో చాలామంది ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు.స్కిల్ డెవలప్‌మెంట్, ఏపీడీసీ, ఈ ప్రగతి, ఆర్టీజీఎస్, స్పందన కాల్ సెంటర్లలో వైసీపీ కార్యకర్తలకు ఉద్యోగాలు కల్పించారు. ఇలా ఒకటో రెండో కాదు వందలాది మంది నకిలీ ఉద్యోగులకు ప్రతి నెల జీతాలు చెల్లించారు. ఈ శాఖలతో సంబంధం లేని వారు, వైసీపీ తరపున సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేసిన వారు, వారి కుటుంబ సభ్యులకు ఈ ఖాతాల నుంచి చెల్లింపులు జరిపారు. యూ ట్యూబర్లు, మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఈ జాబితాలలో ఉన్నారు.కొన్ని చోట్ల ప్రభుత్వ కార్యాలయాల్లో విధుల్లో ఉన్న అసలు సిబ్బందికంటే రెట్టింపు సంఖ్యలో వీరు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీ తనం పెంచడానికి ముఖ గుర్తింపు ఆధారిత అటెండెన్స్ అమల్లోకి తీసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరందరికి అటెండెన్స్ లేకపోయినా ప్రతినెల టంచనుగా జీతాలు ఇచ్చేసింది. వీరిలో చాలామంది అధికార పార్టీ తరపున సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై దుష్ప్రచారం చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటమే ధ్యేయంగా పని చేశారు. ఇలా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న వారికి ప్రభుత్వం నుంచి జీతాలను చెల్లించారని భావిస్తున్నారు.ప్రభుత్వ నోటిఫికేషన్ల ద్వారా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసి పరీక్షలు, ఇంటర్వ్యూల ద్వారా ఎంపికై రోజూ కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగాలు చేసిన వాళ్లు కూడా కొత్త ప్రభుత్వం రాకతో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రభుత్వాలు మారినపుడల్లా భయంతో గడపాల్సి వస్తోందని చెబుతున్నారు.ప్రభుత్వం, ఆర్థిక శాఖ అనుమతించిన పోస్టుల కంటే అదనంగా కొత్త వారిని చేర్చుకుని వారికి ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు చెల్లించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఈ నకిలీ ఉద్యోగుల దందాకు సూత్రధారులు, పాత్రధారులను కనుగొనే ప్రయత్నాలు చేస్తున్నారు. వేర్వేరు ఉద్యోగాలు చేస్తున్న వారు, గృహిణులు, ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉన్న వారికి ఇలా అప్పనంగా ప్రజల సొమ్మును చెల్లించడంపై కొత్త ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా రజనీకాంత్

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ తో 'కూలీ' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా నుండి ఒక చిన్న ప్రచార వీడియోని కూడా ఆమధ్య ఒకటి విడుదల చేశారు. అయితే తాజా సమాచారం ప్రకారం రజినీకాంత్ ఈ సినిమాలో ఎటువంటి పాత్ర చెయ్యబోతున్నారు అనే విషయంపై లీక్ అయింది. ఆ లీకైన సమాచారం ప్రకారం రజినీకాంత్ ఈ సినిమాలో ఒక ఎన్ కౌంటర్ స్పెషలిస్టు పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ఆసక్తికరం ఏంటంటే రజినీకాంత్ ఇంకో సినిమా 'వెట్టయ్యాన్' లో కూడా పోలీసు పాత్రలోనే రజినీకాంత్ కనపడనున్నారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే, రజినీకాంత్, లోకేష్ కనగరాజ్ సినిమాలో మలయాళం సూపర్ స్టార్ ఫహాద్ ఫాజిల్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనపడనున్నారని తెలుస్తోంది. ఈ పాత్ర అనుకున్న వెంటనే ఫహాద్ అయితే బాగుంటారు అని అతనికి వెంటనే కథ చెప్పడం జరిగిందని, ఫహాద్ చెయ్యడానికి అంగీకరించారని తెలిసింది. ఈ సినిమాలో రజినీకాంత్ ఎన్ కౌంటర్ స్పెషలిస్టు అయితే, అతనికి ఒక ఆధునిక సాంకేతిక ప్రత్యేక అధికారిగా రజినీకాంత్ వెన్నంటే వుండే పాత్రలో ఫహాద్ కనిపించనున్నారని తెలుస్తోంది. కేవలం రజినీకాంత్ ఇందులో కథానాయకుడిగా చేస్తున్నారని, ఫహాద్ ఈ పాత్ర వొప్పుకున్నట్టుగా తెలిసింది. ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం అవుతుందని కూడా తెలుస్తోంది. ఫహాద్ ప్రస్తుతం 'పుష్ప 2' సినిమా చిత్రీకరణలో వున్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకి సుకుమార్ దర్శకుడు. ఈ సినిమాలో ఫహాద్ పోలీసు ఆఫీసరుగా కనిపించనున్నారు.




# శృతికి చిర్రెత్తించిన నెటిజన్ ప్రశ్న




ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నపై నటి శ్రుతి హాసన్ అసహనం వ్యక్తంచేశారు. 'మాలా ఉండేందుకు ప్రయత్నించకండి' అంటూ సదరు వ్యక్తికి సూచించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే శ్రుతి తన సినిమాల విశేషాలతోపాటు అప్పుడప్పుడు అభిమానులు, నెటిజన్లతో ముచ్చటిస్తుంటారనే సంగతి తెలిసిందే. 'సౌత్ ఇండియన్ యాసలో ఏదైనా చెప్పండి' అంటూ సదరు నెటిజన్ కోరగా ఆమె స్పందించారు.ఓకే.. ఇలాంటి వివక్షలే వద్దు. మీరు మమ్మల్ని చూసి ఇడ్లీ, సాంబార్ అని అనడం సరైంది కాదు. మీరు మమ్మల్ని అనుకరించలేరు. మాలాగా ఉండేందుకు ప్రయత్నించొద్దని అన్నారు. బాలీవుడ్ నటులు.. దక్షిణాది నటులను చిన్నచూపు చూస్తుంటారని, దాన్ని దృష్టిలోపెట్టుకుని ఆమె ఇలా సమాధానం ఇచ్చారేమోనని పలువురు అభిమానులు అభిప్రాయం వ్యక్తంచేశారు. పలు సినీ వెబ్‌సైట్స్ సైతం ఈ కోణంలోనే కథనాలు రాశాయి. కొన్ని నెలల క్రితం జరిగిన ఓ పెళ్లి వేడుకలో బాలీవుడ్ హీరో ఒకరు.. దక్షిణాది హీరోను చులకనగా చూడడమే శ్రుతి అసహనానికి కారణమై ఉండొచ్చని పేర్కొన్నాయి. ఇటీవల తన రిలేషన్ స్టేటస్ గురించి తెలిపిన సంగతి తెలిసిందే. 'మీరు సింగిలా.. రిలేషన్‌లో ఉన్నారా?' అని సోషల్ మీడియా వేదికగా ఒకరు ప్రశ్నించగా తనకు ఆ తరహా ప్రశ్నలు నచ్చవంటూనే సింగిలే అని క్లారిటీ ఇచ్చారు. రిలేషన్ కోసం ఎదురుచూస్తున్నానన్నారు. సినిమాల విషయానికొస్తే.. 'డకాయిట్' , 'చెన్నై స్టోరీ'ల్లో నటిస్తున్నారు. 'సలార్' సీక్వెల్ 'సలార్ 2' లోనూ సందడి చేయనున్నారు.

# డాన్-3లో రణ్‌వీర్‌తో జతకట్టిన కియారా

గతేడాది 'సత్యప్రేమ్ కీ కథా' సినిమాతోనే సరిపెట్టుకున్న బాలీవుడ్ కథానాయిక కియారా అడ్వాణీ.. ఈ ఏడాది ఆ లోటును తీర్చడానికి వరుస సినిమాలతో రావడానికి ముస్తాబవుతోంది. త్వరలో 'గేమ్ ఛేంజర్'తో ప్రేక్షకులను పలకరించనున్న ఈ భామ.. రణ్‌వీర్ సింగ్‌తో 'డాన్ 3' కోసం జతకట్టిన సంగతి తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఫర్హాన్ అక్తర్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను వచ్చే ఏడాదిలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు దర్శకుడు. పరిశ్రమకు పరిచయమవుతున్న ఈ నయా డాన్ పాత్రను మునుపెన్నడూ చూడని విధంగా తీర్చిదిద్దుతున్నారట. మొదటి షెడ్యూల్‌లో భాగంగా ఈ సినిమాకే కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'సింగమ్ అగైన్' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు రణ్‌వీర్‌సింగ్.





# కల్కి చిత్రానికి సెన్సార్ పూర్తి

## మూవీ రన్‌టైమ్ 180 నిముషాలు

ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పడుకోణె, దిషా పటాని లాంటి నటీనటులు నటించిన 'కల్కి 2898 ఏడి' సినిమా ఈనెల 27న విడుదలవుతున్న సంగతి తెలిసిందే. నాగ్ అశ్విన్ ఈ సినిమాకి దర్శకుడు. ఇది ఒక సైన్స్ ఫిక్షన్ కథ అని ముందే చెప్పారు. ద్వాపర యుగం అయిన తరువాత, కలియుగం తరువాత కొన్ని సంవత్సరాలు ఇలా మూడు ప్రదేశాల్లో జరిగియే కథలు చూపించటానికి ప్రయత్నం చేశారు దర్శకుడు. వాటికే కాంప్లెక్స్, కాశీ, శంబాలా అని ఇలా మూడు పేర్లు పెట్టి ఈ మూడు పట్టణాల్లో జరిగే సంఘటనలు చూపించినట్టుగా తెలుస్తోంది. ఈ సినిమా సెన్సారు కార్యక్రమాలు హైదరాబాదులో పూర్తయ్యాయి అని తెలుస్తోంది. ఈ సినిమాకి ముందుగా వాయిస్ ఓవర్ లో డిస్క్రిమినేషన్ ఇవ్వవలసిందిగా సెన్సారు సభ్యులు కోరినట్టుగా తెలిసింది. ఈ సినిమా కల్పిత కథ అని సెన్సారు సభ్యులు వెయ్యమన్నారు అని తెలిసింది. అలాగే ఈ కథలో సినిమా కోసం సినిమా లిబర్టీ తీసుకున్నారని, అంతేకానీ ఏ మతాన్ని కించపరచాలని ఉద్దేశం తమకి లేదని కూడా వెయ్యమన్నట్టుగా సినిమా చూసిన సెన్సార్ సభ్యులు చెప్పినట్టుగా తెలిసింది. అలాగే ఎక్కువగా కట్స్ ఏమీ లేకుండానే ఈ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చినట్టుగా తెలిసింది. సర్టిఫికెట్ లో ఈ సినిమా నిడివి 180 నిమిషాల 56 సెకండ్స్ వున్నట్టుగా తెలిసింది. 180 నిముషాలు అంటే మూడు గంటల పాటు ఈ సినిమా ఉంటుంది. ఇది ప్రభాస్ సినిమాలు అన్నిటికన్నా చాలా ఎక్కువ నిడివి వున్న సినిమా అని తెలుస్తోంది. ప్రభాస్ ముందు సినిమా 'ఆదిపురుష్' నిడివి 179 నిముషాలు ఉంటే, ప్రభాస్ ఇంకో సినిమా 'సలార్' సినిమా నిడివి 175 నిముషాలు ఉంటుంది. ఇంకో సినిమా 'సాహో' కూడా 171 నిముషాల నిడివి వుంది. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'బాహుబలి', 'బాహుబలి 2' సినిమాలు కూడా వరసగా 159, 168 నిముషాల నిడివి ఉంటుంది. ఇప్పుడు వచ్చిన 'కల్కి 2898ఏడి' ఇప్పటివరకు విడుదలైన ప్రభాస్ సినిమాలలో ఎక్కువ నిడివి కలిగిన చిత్రంగా వుంది.

Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154